మయసభ

శ్రీ మధురాంతకం రాజారాం

బొంయ్. బొంయ్‌మని సూర్యం హారన్ మ్రోగించాడు. హారన్ మ్రోత వినబడగానే పిలుపందుకుని తోటమాలి రాముడు పరుగుపరుగున వచ్చి యినుపకమ్ముల గేటు తీయడం మామూలు. బహుశా మేడకు వెనుకవైపున అరటిచెట్లకు నీళ్లు చేది పోస్తున్నాడేమో, రాముడికి హారన్ శబ్దం వినిపించినట్టులేదు సూర్యం చిరాకుతో అటూ, యిటూ చూచాడు. ఆచూచిన క్షణంలోనే మొండిచేతి ముసలివాడొకడు కొత్తగా సూర్యం జీవితంలో ప్రవేశించడం సంభవించింది.

నల్లటి, తెల్లటి వెంట్రుకలు సమపాళంగా వున్న జీబుగడ్డమూ, బాగా నెరసిపోయిన కనుబొమలూ, అగాధమైన లోయల్ని తలపింపజేసే ఆకళ్లు, కొండకొమ్ములా పైకిలేచిన ఆనాసిక, చవిటి పర్రలా ఎండిపోయిన పెదవులు, పగటిపూట చూస్తే రాత్రివేళ కలలో కనిపించే ఆకారం అది! వేషంకూడా అతని ఆకారానికి తగినట్టే అమరింది. కాషాయాంబరంగా రూపొంది ఎంతకాలమైందో అంచనాకు అందని నాలుగుమూళ్ళ పంచఒకటి అతడి మోకాళ్ళదాకా వ్రేలాడుతోంది. చిరుగుల్లో ఎండిన మామిడాకులాంటి శరీరచ్ఛాయను ప్రదర్శిస్తున్న పాతకోటొకటి అతడి శరీరాన్ని అంటిపెట్టుకునివుంది.

కారు సరాసరి లోపలికి వెళ్ళిపోయివుంటే సూర్యం ఆముసలివాడిని అంత పరిశీలనగా చూడ్డం జరిగేదికాదు నిజానికది అడ్వోకేటు సూర్యనారాయణ బికారుల్నీ, బిచ్చగాళ్ళనీ చూచి సానుభూతి వ్యక్తంచేయడానికి సమయమూ కాదు. అవతల అతనికి బోలెడన్ని పనులున్నాయి. సరిగ్గా పదకొండు గంటలకు కోర్టులో అతడికోసం కేసొకటి కాచుకుని వుంది. ఆలోపల స్నానమూ, భోజనమూ కానిచ్చి నాలుగైదు రిఫరెన్సులు కోట్ చేసి పెట్టుకోవాలి. ఇంతపనితొందరకు తోడూ చంద్రశేఖరంగారు సతీసమేతంగా తీర్థయాత్రకు వెళ్ళదలచుకున్న యాత్రాస్పెషలుకు ప్రయాణ ముహూర్తం కూడా వుదయం ఎనిమిదిగంటలకు కుదిరింది. వాళ్ళని స్టేషనులో దిగవిడిచి ఎంతత్వరగా యిల్లుచేరదలచుకున్నా మీనాక్షి సూర్యాన్ని విడిచిపెట్టిందికాదు. చెప్పిందే పదిసార్లు చెప్పడం ఆమె వాడుక. నీరజకు యింటిపనులతోనే సరిపోతుంది గనుక పాపనెత్తుకోడానికి ఒకకుర్రాణ్ణి పెట్టుకోమని ఆమె రెండుగంటలవ్యవధిలో పదిపదిహేనుసార్లు హెచ్చరించింది. రైలుకదలగానే సూర్యం హుటాహుటిగా యింటికి బయల్దేరాడు. కారు డ్రయివు చేస్తున్నాడన్నమాటేగాని అతని ఆలోచనలన్నీ కేసుపైన్నే వున్నాయి తను వాదమిలా ప్రతిపాదిస్తాడు, అందుకు ప్రతివాద మిలావుంటుంది. అప్పుడు తను ఫలానా పీనల్ కోడ్‌నుంచి ఫలానా సెక్షన్ వుదహరిస్తాడు...పరధ్యానంలోనుంచి వులిక్కిపడి సూర్యం కారుకు సడన్‌బ్రేక్ వేశాడు. అప్పటికీ కారుగేటుకు ఢీకొని రెండుబారలు వెనక్కువచ్చి మరికదలకుండా నిలిచిపోయింది. ఎలాగైతేనేం, అదృష్టవశాత్తు ప్రమాదం తప్పింది!

హారన్ మ్రోగిస్తూ సూర్యం కాలువ ప్రక్కన తూమురాయికి ఆనుకుని నిల్చునివున్న ముసలివాడిని చూచాడు. పరిస్థితుల్ని అర్థంచేసుకుని అతడు తనకుతానే గేటు తెరుస్తాడనికూడా సూర్యం అనుకున్నాడు. కానీ అలాటిదేమీ జరుగలేదు. అదేం చిత్రమోగానీ ఆవృద్ధుడు ఈవిశాలప్రపంచంలో మునుపెన్నడూ మానవమాత్రుణ్ణి చూచి ఎరుగనట్టు సూర్యంకేసి అబ్బురంగా, కౌతుకంతో పరీక్షగా చూస్తూ నిలుచున్నాడు.

ఇదిగో నిన్నే! ఆగేటుకాస్త తెరువగూడదూ అన్నాడు సూర్యం.

ముసలివాడు కారుకు దగ్గరగావచ్చి కుడిచేయి పైకెత్తి చెవికడ్డంగా తిప్పుతూ తనకు మాటలు వినబడవని సూచిస్తూ సైగచేశాడు.

"పైగా యిదోకటా! బాగుంది. బాగుంది" అనుకుంటూ సూర్యం జేబులో చేయి వేశాడు. ఒక నాలుగణాలకాసు పైకి వచ్చింది. "తీసుకో, తీసుకో" అంటూ సూర్యం చేయిచాచాడు.

అయాచితంగా లభించిన నాలుగణాల రాక కోసం ఆతురతగా దోసిలి పట్టవలసిందిపోయి ముసలివాడు ప్రపంచ పటంలో ఏదో మారుమూలపట్టణాన్ని వెదుకుతున్న కాలేజి విద్యార్థిలా సూర్యం ముఖంలోకి తీక్ష్ణంగా చూస్తూవుండి పోయాడు!

సూర్యానికి చిర్రెత్తుకొచ్చింది. కారుదిగి తనే స్వయంగా గేటు తెరుచుకోడం కన్నా గత్యంతరం లేదనిపించి అతడు పైకి లేవబోయాడు. ఇంతలో కిర్రుమని శబ్దం చేస్తూ గేటు తెరచుకుంది. 'జామచెట్టుకు అంటుగడ్తున్నానండీ! హారన్ వినిపించలేదు. అమ్మగారు పిలిచి చెప్పారు" అంటూ రాముడు క్షమాపణ చెప్పుకున్నాడు.

దీన్ని తీసుకుని అతణ్ణి వెళ్ళిపొమ్మని చెప్పు రాముడూ మరీ ఈ బిచ్చగాళ్ళకు ఆశ ఎక్కువై పోతోంది; ఎంత యిచ్చినా మరికొంత రాబట్టాలనే చూస్తారు" అంటూ సూర్యం నాలుగణాల కాసును రాముడి చేతిలో వేసి మళ్ళీ కారు స్టార్టు చేశాడు.

* * * *

ఆరోజు కేసులో సూర్యానికి అత్యద్భుతంగా విజయం చేకూరింది. ప్రతివాదితరపు వకీలు న్యాయవాద వృత్తిలో తలనెరసిన మనిషి. సూర్యం కనిపించినప్పుడల్లా అతడు పిల్లకాకికేం తెలుసులే వుండేలు దెబ్బ అన్న భావాన్ని వ్యక్తం చేస్తూ నిర్లక్ష్యంగా ఓ చిరునవ్వు అతడిపైకి సంధించేవాడు. సూర్యానికా చిరునవ్వు కంటే రంపపుకోత నయమనిపించేది. అలాంటివకీలు ఈనాటికి ఈకుర్ర లాయరులోనూ కొంతసరుకు లేకపోలేదని గుర్తించగలిగాడు. అంటే ఏమన్నమాట! ఉజ్వలమైన భవిష్యత్తుకు తనీరోజున సుదృఢమైన పునాది వేసుకున్నాడన్నమాట! ఎంత గుండెలుతీసిన బంటయినా యిక తనంటే జంకక తప్పదు...విజయ గర్వంతో సూర్యం వాలు కుర్చీలో కూర్చుని నీరజచేతి కాఫీ తాలూకు మాధుర్యంలో వివశుడై పోసాగాడు.

తామరతూడులాంటి చల్లటిచేతిని సూర్యం భుజంపైనవేసి "ఏమండీ! ఈరోజు అదోలా వున్నారు" అంది నీరజ.

సూర్యం కుర్చీలోకి వాగావాలి "ఏం లేదు నీరజా! నిద్రలేవగానే నిలువుటద్దంముందు నుదుట కుంకుమ పెట్టుకుంటున్న నిన్ను చూచానా! అప్పుడే అనుకున్నాను, ఈరోజు మనమాటకు తిరుగులేదని! అది కోర్టుకాదు, కురుక్షేత్రమనుకో! కురువృద్ధుడొకటే, ప్రతిద్వంద్వి రామారావు గారొకటే కాదు. ఆయనొకటికే తాళంపడిందంటే, యిక చూచుకో" అంటూ నీరజను తన ఒడిలోకి లాక్కోబోయాడు.

చేతిని విడిపించుకుంటూ నీరజ కుర్చీదగ్గరకు లాక్కుని 'మీకేంబాబూ! కోర్టుకు వెళ్తారు కుస్తీలు పడ్తారు. అలాగే క్లబ్బుకువెళ్ళి ప్రొద్దంతా పోగొట్టుకుని రాత్రి ఏ ఎనిమిదికో తొమ్మిదికో యింటికి వేంచేస్తారు. ఈ యింట్లో నేను బిక్కుబిక్కుమని ఈగలు తోలుకోవాలి" అంటూ అప్పటికి తనేదో పెద్ద చిక్కులో యిరుక్కుపోయినట్టు బుంగముఖం పెట్టుకుంది.

భార్యనెలా అనునయించాలో తోచక సూర్యం "పిన్ని చెప్పినట్టు పాపనెత్తుకోడానికి ఒకకుర్రాణ్ణి కుదుర్చుకుందాంలే నీరజా! నీకు తోడుగాగూడా వుంటాడు" అన్నాడు.

"కుర్రాడేంతోడండి మీరు మరీనూ! అందులోనూ మనింట్లోనా! ఎక్కడివస్తువు లక్కడే వుంటాయి. ఆ వచ్చేకుర్రాడు కొంచెం చేతివాటు మనిషైతేసరి, కొంపగుండమై వూరుకుంటుంది. అదీగాక పాపగూడా నాదగ్గర లేకపోతే నాకేం తోచదండీ" అంది నీరజ.

"ఐతే నీవుద్దేశమేమిటి? స్పష్టంగా చెప్పరాదూ" అన్నాడు సూర్యం. అసలీప్రసంగమే అతడికి నచ్చడంలేదు. ఆడవాళ్లు ఎంతచదువుకుంటేనేమి, వాళ్ళకు అంతర్జాతీయరాజకీయ వ్యవహారాలకన్నా యింటిగోడవలే గొప్పవిగా కన్పిస్తాయని నీరజ కాపురానికివచ్చిన నాలుగైదేళ్ళలో సూర్యానికి ఒక నిర్దుష్టమైన అభిప్రాయం కలిగింది.

"బజారుకనీ, మార్కెట్టుకనీ రోజు కైదారుసార్లయినా రాముడు వూళ్ళోకి వెళ్ళిపోతుంటాడు. వంటావిడ రెండుపూటలావచ్చి ఒకటి రెండుగంటల్లో తనపని పూర్తిచేసుకుని వెళ్ళిపోతుంది. ఒంటరిగా యింట్లోవున్నప్పుడు—మీరు నవ్వుతారు, నాకు

తెలుసు. పగలుగూడా ఏం దొంగలభయ మని మీధీమా. కానీ నాకేమో భయంగా వుంటుంది. పట్టపగలే దోపిడీ జరిగినట్లు పేపర్లో వార్తలొస్తున్నాయి. మీకు పుణ్యముంటుంది. పోతేపోతుంది ఒక యిరవైరూపాయలు మనవి కావనుకోండి. గేటుదగ్గర కాపలా వాడుంటే నాకేం దిగులుండదు"

ఈ సరిక్రొత్త సలహానిగురించి సూర్యం పూర్తిగా ఆలోచించుకోకముందే నీరజ మళ్ళీ ప్రారంభించింది. "మీతో ఎన్నిసార్లు చెప్పినా లాభముండదు. రాముడితో ఒకసారి చెప్పానో లేదో అప్పుడే ఒకమనిషిని తీసుకొచ్చి చూపించాడు."

"అలాగా" అంటూ ఆశ్చర్యం ప్రకటించాడు సూర్యం

"చెబుతే మీరు నమ్మరు! భూతమనుకోండి మాటలెందుకు! నేనూ ఎందరో ఘూర్ఖావాళ్ళని చూచాను. వాళ్ళతడిముందు దిగదుడుపుకైనా పనికి రారు. అలావుంటాడు మనిషి! అంతే కాదండోయ్, యింకోకవిచిత్రం! వాడికి రెండుపూటలా యింత తిండి పడేస్తేచాలట! ససేమిరా జీతం వద్దంటే వద్దంటాడు. పోనీ ఎందుకైనా పనికొస్తుంది, అయిదో పదో తీసుకుందువు లెమ్మన్నాను."

"ఏమైనా యింటి విషయాల్లో నీకున్నంత శ్రద్ధ నాకులేదు నీరజా!" అంటూ సూర్యం తనకుకించ పరుచుకున్నట్లే భార్యని కొంచెం పైకెత్తేశాడు

"మరోకటండీ పాపం! అముసలాడికి ఎడమచేయి మోచేతివరకూ లేదు. ఏమైపోయిందని అడిగాను. అక్కడెక్కడో రైస్‌మిల్లులో రెండునెలలు పనిచేశాట్ట. చేయి చక్రంలో యిరుక్కుని నలిగిపోయింది. ధర్మాసుపత్రిలో మోచేతివరకూ తీసేశారన్నాడు. అంతటితో అయిందనుకున్నారూ! ఊహు ఒకసారి మలేరియా వస్తే ఇంక్విసైను మాత్రలన్నీ మింగాడట. దాంతో తీరని చెముడొకటి సంక్రమించింది. చూస్తుంటే గుండెలు తరుక్కుపోతాయండీ ఎవడో గానీ!"

"నిజమే, నిజమే" అంటూ గాఢంగానిట్టూర్చాడు సూర్యం.

"ఏతే మీరూ అతణ్ణి చూచారటండీ?" విస్తుపోతూ ప్రశ్నించింది నీరజ.

"ఉదయం స్టేషనునుంచీ తిరిగొస్తూ చూచాను. మళ్ళీ కోర్టుకి వెళ్తూ రాముడితో మాట్లాడుతుంటే చూచాను ఇంతటి పట్టణంలో వాడే మనకు దొరికాడా లేక మనమే వాడికి దొరికామా అని సందేహంగా వుంది. అలాటివాళ్లని వున్నట్టుండే నమ్మడానికి వీల్లేదు నీరజా! పోనీలే. నువ్వతడికి వుద్యోగం కల్పించి యిచ్చావు. యింతలోనే వెళ్ళిపొమ్మనడం ఏం బాగుంటుంది?" అన్నాడు సూర్యం.

"అదేమిటండీ! చూడ్డానికి మోటుగావున్నా అతడు మీరనుకున్నట్టు దుర్మార్గుడుగా కనపడ్డం లేదే!

అతడు దుర్మార్గుడు కాడనే అనుకుందాం నీరజా ప్రస్తుతానికి! నాలుగు రోజుల్లో అదే తెలిసొస్తుంది. పాప అప్పుడే నిద్రపోయిందేమిటి? లేపి అన్నంతినిపించు. నేనయిదునిమిషాలు రెస్టుతీసుకుని లేచిభోంచేస్తాను" అని చిటికెవేస్తూ ఆవులించి కళ్లు మూసుకున్నాడు సూర్యం.

* * *

మరునాడు ఆదివారం. ఎవరో ఒకరిద్దరు క్లయింట్సువచ్చి మాట్లాడి వెళ్లిపోయారు టిఫిన్ అయిన తర్వాత సూర్యం పాపను తీసుకుని మేడపైకి వెళ్లాడు. మేడపైన పడమటివైపు గదిలోకి కిటికీ తెరిస్తే రోడ్డులో తిరుగుతున్న కార్లు బస్సులు, రిక్షాలు అన్నీ స్పష్టంగా కనిపిస్తాయి పాప చువ్వల్ని పట్టుకుని కిటికీలో కూచుంది. సూర్యం ఏదో వారపత్రిక తిరగవేస్తూ పాపకడ్డంగా కుర్చీలో కూచున్నాడు.

"నాన్నా, నాన్నా! అదుగో గడ్డాంతాత! చూడూ" అందిపాప.

సూర్యం తలపైకెత్తాడు. గేటు మూసివుంది. స్టూలుపైన కూచున్న ముసలివాడు యినుపకమ్మల్లోనుంచి ఆక్రితంరోజులాగే అదే వేషంతో, అదే పిచ్చివాలకంతో కనిపిస్తున్నాడు.

"మన గేటు దగ్గర గడ్డాంతాత కూచోడమెందుకు నాన్నా?"

పాపకు సందేహాలు కలిగితే ఆతిరువాత తన చదువు కొనసాగదని సూర్యానికి బాగా తెలుసు. అతడు పుస్తకం మూసిపెట్టి "తెలీదూ నీకూ! అతడు మన యింటికి కాపలావాడన్నమాట. ఎప్పుడూ ఆగేటు దగ్గరుంటాడు. మంచివాళ్లనిమాత్రం లోపలికి

రానిస్తాడు. దొంగలెవరైనా వస్తే అతణ్ణిచూచి భయపడి అలాగే వెళ్లిపోతారు" అన్నాడు.

"దొంగలు పోలీసాళ్లకే భయపడరు. గడ్డాం తాతంటే వాళ్లకొకలెక్కా ఏంటి! పో నాన్నా నువ్వు! నీకేం తెలీదు" అంటూ నవ్వసాగింది పాప.

సూర్యం తెల్లబోతూ "ఈ దొంగల సంగతులన్నీ నీకెలా తెలిసాయి పాపా" అని ప్రశ్నించాడు

"అమ్మ చెప్పిందిగా!

'చెబుతుంది, చెబుతుంది' అనుకుంటూ విసుక్కున్నాడు సూర్యం. కుర్రాళ్లకు వీరగాథలు చెప్పి ధైర్యం, పౌరుషం కలిగించవలసింది పోయి దెయ్యాల కథలు, దొంగలకథలు చెప్పి తమనీడని చూచి తామే బెదిరిపోయేట్టు చేయకూడదని నీరజకు తను వెయ్యిసార్లు చెప్పివుంటాడు. కానీ ఆవిడ వింటేగా! చెప్పినంత సేపూ విని తను వీధిలోకి పోగానే పాపని పిలిచి "మరి మావూళ్లో, అంటే మీ అమ్మమ్మగారివూళ్లో అంభోరగిద్దడని ఒకడుండేవాడు. అబ్బ, అబ్బ, ఎంత పెద్దదొంగనుకున్నావు" అంటూ ఓ కథని యితిహాసంలా ప్రారంభిస్తుంది.

ఇంతలో పాప మరొక కొత్త సందేహాన్ని వెలిబుచ్చింది. "గడ్డాంతాత ఎప్పుడూ అక్కడే వుంటాడన్నావే నాన్నా! మరి అతగాడికి ఆకలేయదూ?"

"ఆకలైనప్పుడు యింటికొచ్చి అన్నంతిని, మళ్ళీ అక్కడికే వెళ్ళిపోతాడు."

"అప్పుడు దొంగలు లోపలికొచ్చేస్తే?"

సూర్యం నిరుత్తరుడైపోయాడు. వాదంలో అడ్వొకేటు రామారావుగారినైనా జయించవచ్చుగానీ పాపను అసందిగ్ధంగా ప్రత్యుత్తరాలివ్వడం కష్టం.

సూర్యం పాపను క్రిందికి దించి "నువ్వరోడ్డు వైపు చూచింది చాలుగానీ, హాల్లోకివెళ్ళి బొమ్మలతో ఆడుకోపాపా" అన్నాడు.

పాప లోపలికి వెళ్ళిపోయింది. సూర్యం పత్రికను టేబిల్‌పైకి విసిరి గేటువైపు చూడసాగాడు. ఆలోచనంటూ ఒకటి పెట్టుకోకపోతే ఏమీ లేదుగానీ, అది మనసులో రగలసాగితే మటుకూ తనకూ పాపకు కలిగినట్టే ఎన్నో సందేహాలు కలుగుతాయి. నిన్నటివరకూ ఈ ముసలివాడు తనకు అపరిచితుడు. ఈ పట్టణంలో శాశ్వతంగా మకాం ఏర్పరచుకున్న బిచ్చగాళ్లు కొందరున్నారు. వాళ్లు ఏఏ సమయాల్లో ఎక్కడెక్కడ ప్రత్యక్షమౌతారో తనకు బాగా తెలుసు. కానీ యితణ్ణి మాత్రం యింతకుముందు చూచిన జ్ఞాపకం లేదు. బహుశా యితడు కొత్తగా ఈ ప్రాంతాలకు విజయం చేశాడేమో! పూర్వాశ్రమంలో యితడెక్కడున్నట్టు? ఏం చేసినట్టు? బ్రతుకు తెరువుకోసం కడుపు చేతబట్టుకుని యిలా వచ్చి వుంటాడని సరిపెట్టుకుందామనుకున్నా, యితడు తనకు ధనరూపకమైన ప్రతిఫలం వద్దంటున్నాడెందుచేత? అవునవును బొంతపైన చూపు నిలిపిన ఆషాఢభూతులకు గడ్డిపోచలు పనికిరావు

తోటలోనుంచి గదిలోకి వస్తున్న ప్రభాత వాయువులు శరీరానికి సోకనూ, సోకనూ సూర్యం కళ్లు మూతపడ్డాయి. కూర్చున్న కుర్చీలోనే అతడు పదిపదిహేను నిమిషాలపాటు కునికిపాట్లు పడి ఆతరువాత లేచి ప్రక్కనేవున్న మంచంపైకి మేను చేరవేశాడు. ఇల్లంతా ప్రశాంతంగా వుండడం మూలాన సూర్యానికి పడుకోగానే నిద్రపట్టింది

నిద్రలో ఒక కలగన్నాడు సూర్యం. చిత్రమైన కల! ఎందుకో ఎక్కడికో తెలియడంలేదు. ఖడ్గహస్తుడై తనొక దుర్గమారణ్యంలో పరుగెడుతున్నాడు. అప్పుడప్పుడు భయంకరమృగాలు, భీకర పన్నగాలు ఎదురౌతూవున్నా వాటిని తను సరకుచేయడంలేదు. ఆఖరుకొక శిథిలదేవాలయం దృగ్గోచరమైంది. దేవాలయాంతర్భాగంలో ఒకచేత ఆసవపాత్రను, మరొక చేత మానవ కపాలాన్నీ ధరించి కళ్లుమూసుకుని కాపాలికుడొకడు 'ఓం, హ్రీం' అంటూ మంత్రం జపిస్తున్నాడు. అతడికెదురుగా పూచిన కడిమిచెట్లు రెండున్నాయి. వాటికి ఓ యిరవైఏళ్ల యువతి, ఓ నాలుగైదేళ్ళ అమ్మాయి తీగలతో బంధింపబడివున్నారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఆ కాపాలికుడెవడో కాదు. తనయింటి కాపలావాడు. బంధితులెవరో కాదు. ఒకతె నీరజ మరొకతె పాప!

ఆ కోపంలో తను ఖడ్గాన్ని పైకెత్తి ఒక్క వేటుతో కాపాలికుణ్ణి తెగవేయ నుంకించాడు. కానీ యింతలో ఆ నరఘాతకుడు కళ్లుతెరచి తనపైకి వురికాడు. 'హీనుడా! చూడు నిన్నేం చేస్తానో' అంటూ మంత్రదండంతో తన తలపైన ఒక్క వేటు

వేశాడు—ఆ దెబ్బతో సూర్యానికి నిద్రాభంగం కలిగింది. అతడు వులిక్కిపడి కళ్లు తెరచుకున్నాడు. ఆదుర్గమారణ్యం, శిథిలాలయం, ఆ కాపాలికుడు అంతా తన భ్రమ! పగటిపూట కళ్లుమూస్తే కలతనిద్రలో, లేనిపోని పాడుకలలన్నీ వస్తాయి. ఐనా యిటు జాగ్రదవస్థలోనూ, అటూ స్వప్నావస్థలోనూ తన తలపులన్నీ ఆ ముసలివాడిపై కెందుకిలా ప్రసరిస్తున్నాయి? వాడెవడు? తనెవడు? లోకంలో ఆలోచించుకోడానికెన్నో బృహత్తర విషయాలుండగా మాటిమాటికీ ఈ బికారివాడినిగురించి ఆలోచిస్తూ తన మనసును పాడుచేసుకోడమెందుకు? ఏవడోగానీ ఈముసలివాడు తనకొక పీడలా దాపురించాడు!

చిరాకుతో పైకిలేచి సూర్యం అప్రయత్నంగా మళ్ళీ కిటికీదగ్గరికే వెళ్ళి నిలబడ్డాడు!

ఈసారి ముసలివాడి భంగిమ మారింది. అతడు గేటుకు ఆనుకుని తోటలోపలికి చూస్తున్నాడు. అంతగా తోటలో అతణ్ణి ఆకర్షిస్తున్నదేదో తెలియక సూర్యం విస్తుపోయాడు. ఇంతలో నందివర్ధనం చెట్లచాటునుంచి పాప బయటికి వచ్చింది. ఏమాత్రం జంకు గొంకులు లేకుండా పువ్వులు కోసుకుంటూ ఆమె గేటుకు సమీపంగా వెళ్తోంది

ఆక్షణాన సూర్యం బుర్రలో ఒక కొత్తసంశయం పొడసూపింది. దాని తాకిడికి అతడు నిలువునా కంపించిపోయాడు. ఒకవేళ ఈముసలివాడు కుర్రాళ్లనెత్తుకొని పారిపోయే దొంగేమో! ఐతే కావచ్చు! ఎవరు చూశారు? లేకుంటే కొరికి తినేద్దామన్నంత ఆకాంక్షతో అతడెందుకలా పాపను చూస్తున్నాడు? చూడ్డమేమిటి! కమ్మిల్లోనుంచి చేయిచాచి అతడు పాపను దగ్గరికి రమ్మని పిలుస్తున్నాడు

సూర్యం ఎలుగెత్తి 'దొంగ, దొంగ' అని అరుద్దామనుకున్నాడు. కానీ నోరు పెగల్లేదు. క్రిందికి దిగి పరుగునావెళ్లి పాపనింటికి తెచ్చుకుందామనుకున్నాడు. కానీ ఆలోపలే ముసలివాడు పాపనెత్తుకుని పారిపోతే? ఏంచేయడానికీ పాలుపోక సూర్యం కిటికీ దగ్గర అలాగే నిలుచుండిపోయాడు.

కాని సూర్యం అనుకున్నంతటి అవాంతరమేదీ సంభవించలేదు. ముసలివాడికేసి విచిత్రంగా చూస్తూ పాప గేటుదగ్గరికి వెళ్లిపోయింది. అమాయకంగా అతడినేదో ప్రశ్నించింది. ప్రశ్నకు జవాబులేదు. ముసలివాడు తనకోటు జేబులోనుంచి ఓచిన్న అరటిపండు పైకితీసి పాపచేతిలో వుంచాడు. కిలకిలానవ్వి పాప వెనుదిరిగి గంతులు వేసుకుంటూ యింటివైపురాసాగింది. దూరమైపోతున్న పాపను చూస్తూ ముసలివాడు విగ్రహంలా అక్కడే నిలబడివున్నాడు.

* * *

నాలుగైదు రోజులు గడిచిపోయాయి. ఓరోజు వూళ్ళోకి కొత్తగా ఓసినిమా వచ్చిందని కాస్త ప్రొద్దుండగానే యిల్లు జేరుకోమని నీరజ పురమాయించినందువల్ల సూర్యం కోర్టునుంచీ నేరుగా యింటికి వచ్చేశాడు. కాని సినిమా ప్రోగ్రాముగురించి సుతరామూ మరచిపోయినట్టు, టేబిల్ క్లాత్ పైన ఏదో కుట్టుకుంటూ కుర్చీలోకూర్చున్న నీరజ ప్రత్యక్షమయ్యేసరికి సూర్యం ముఖంలో చిరుకోపపు ఛాయలు క్రమ్ముకున్నాయి.

"ఐనా నీ ఖోరణే నీది నీరజా! నన్ను త్వరగా రమ్మనడమేమిటి? నువ్వి రాచకార్యంలో లీనమైపోవడమేమిటి?" అంటూ చిరగ్గా వాలుకుర్చీలో కూలబడ్డాడు సూర్యం.

"మీరింత తొందరగా వస్తారని నాకేం తెలుసండీ! మరచిపోవడాలు మీకు మామూలే గదా! ఐనా నా ముస్తాబు కేముంది! ఐదునిమిషాల్లో రెడీ అయిపోతాను. చూడండి" అంటూ నీరజ గబగబా లోపలికి వెళ్లింది.

ఎంత త్వరగా తెమిలినా థియేటరు చేరుకునేసరికి ఆలస్యం కావడం, 'అయ్యో, యింక కథ అర్థం కావడమెలాగని విచారించడం నీరజకు పరిపాటే! ఇప్పుడూ అదే జరిగింది. కానీ సూర్యానికి మాత్రం కథ అర్థంకావాలని అంత పెద్దపట్టింపేమీ లేదు అర్థమైతే కావచ్చు కాకపోతే అందుకతడు చింతించడు. ఎంతగా వెండితెర అని ఉత్ప్రేక్షించినా అది కేవలం మల్లుగుడ్డే కదా అని సూర్యం విశ్వాసం! ఎంతగా కథ సూర్యాన్ని తనవైపుకు ఆకర్షించుకోజూచినా, బలవత్తరమైన సంఘటనల వల్ల కలిగిన పతాక పరిణామం ఎంతగా హృదయాన్ని ఉద్విగ్నం చేసిపారవేసినా అడుగడుగునా యిది కల్పితగాథేనని మననం చేసుకుని మళ్ళీ మామూలు మనిషైపోతుంటాడు సూర్యం. సూర్యంది ఆదినుంచీ అతివాస్తవిక దృష్టి!

కాని ఈసారిమాత్రం సూర్యం అంత నిర్లిప్త భావంతో సినిమా చూడలేకపోయాడు. ఆ చిత్రంలో సాత్వికుడైన ఒక నిరుపేద యువకుడు పరిస్థితుల ప్రాబల్యంవల్ల నికృష్టస్థితికి ఎలా దిగజారిపోయాడో నచ్చజెప్పడానికి కథకుడు తీవ్రంగా ప్రయత్నించాడు. ఒకవైపు యిళ్ళకు కన్నం వేస్తూ, మరోవైపు ఆడబ్బును దీనులకూ, హీనులకూ వెదజల్లుతున్న కథానాయకుడి ద్వంద్వవ్యక్తిత్వం చూపరులకు విభ్రమంగొలుపుతోంది. ఓరోజు రాత్రి ఆగజదొంగ భద్రవేషంతో పురవీధుల్లో విలాసంగా షికారు బయల్దేరాడు. అతడికో మేడ నిర్జనంగా కనిపించింది. దొంగ అక్కడ కొంతసేపు ఆగాడు. తరువాత వున్నట్టుండి ప్రాకారకుడ్యం పైకెక్కి చివాలున అవలికి దూకాడు. మేడకు పదిగజాలదూరంలో వున్న గంగరావిచెట్టుపైకెగబ్రాకి, కొమ్మ చివరదాకా వచ్చి కుప్పించి రెండో అంతస్థులోకి దూకాడు!

"ఇదిగో నీరజా! ఇంటిదగ్గర రాముడు కూడా వున్నాడు కదూ!" నీరజవైపుకు వ్రాలి మెల్లగా ఆమె చెవిలో ప్రశ్నించాడు సూర్యం.

"రాముడా! నాలుగ్గంటలకే వెళ్ళిపోయాడే! వాచ్ మేన్ ఒకడుండగా మళ్ళీ రాము దేనికండీ యింటిదగ్గర?"

కొంప మునిగిందనుకున్నాడు సూర్యం. మారువేషంలో ఈగజదొంగ ఎలావున్నాడో, తను యింటికి కాపలాకాసే ముసలివాడు కూడా యించుమించు అలాగే వుంటాడు. ఇక్కడ దొంగ కెలాటి అవకాశమైతే లభించిందో, అక్కడ ముసలివాడికీ సరిగ్గా అలాటి సదవకాశమే లభించింది. నీరజది ఎలాగైనా ఆడపుట్టుక! అత్యవసర సమయాల్లో తప్పా మిగిలినప్పుడల్లా ఆడవాళ్ళబుద్ధి చురుకుగా పనిచేస్తుంది. కానీ తనుమాత్రం ఏమంత ప్రయోజకత్వాన్ని వెలగబెట్టినట్టు! దొంగను (అతడు దొంగకాడని నిదర్శనమేదీ!) యిల్లప్పగించి తను థియేటరులో కుషనుకుర్చీలో సుఖాసీనుడై నిమ్మకు నీరెత్తినట్టు సినిమా చూస్తున్నాడు! ఒక మనిషిని మరొకమనిషి విశ్వసించడం మంచిదే! కాని అలా విశ్వసించడానికి ముందు ఈ మనిషి ఆమనిషి తత్వాన్ని అవగాహనచేసుకుని వుండాలి. ఏనాటి వాయసమో, పంచతంత్రంలో కాబోలు, కులమూ శీలమూ తెలియకుండా కొత్తవాళ్ళని నమ్మరాదంటుంది.

తటాలున పైకిలేచి "కళ్ళెందుకో తిరుగుతున్నాయి నీరజా! కాసేపు బయటవుండి వస్తాను" అని చరచరా థియేటరునుంచి బయటికి వచ్చేశాడు సూర్యం.

అప్పుడప్పుడే సన్నగా చినుకులు జారుతున్నాయి. ప్రగాఢ నీలవర్ణం కైసేసికొన్న మేఘమాలికలు అశాంతాలు అవఘులుగా లోకాన్ని ముట్టడించివేస్తున్నాయి సూర్యం రోడ్డుపైకి వచ్చేసరికి ఓవైపున మెరపొకటి ధగధగా మెరిసింది. వెనువెంటనే ఒక ఉరుము ఫెళఫెళా వురిమింది. రోడ్డులో అతడు నాలుగడుగులు వేశాడో లేదో జల్లుజల్లున జడివాన కురవసాగింది.

వర్షం వస్తోందని వెనుకడుగు వేయడానికి సూర్యానికి మనస్కరించలేదు. నిర్జనమైన మేడ. కాకిని వ్రేలాడగట్టినట్టున్న మేఘాలక్రింద చిక్కగా క్రమ్ముకుంటున్న కారుచీకటి, పైగా జడివాన! దొంగతనం చేయడానికి యింతకంటే అమూల్యావకాశం ఎప్పుడు దొరుకుతుంది? కారులో బయల్దేరితే ఎట్లా లేదన్నా రోడ్డుపైన యింటికి ఒకటి ఒకటిన్నర మైళ్ళ దూరముంది. సందుల్లో దూరి వెళ్తే నాలుగు ఫర్లాంగుల కన్నా ఎక్కువుండదు. అదీగాక రోడ్డులో కారు కనబడేసరికి దొంగ కాలికి బుద్ధిచెప్పడానికి అవకాశముంటుంది. కాదు, కాదు ఎంతవాన కురిసినా సరే తను నడిచే పదినిమిషాల్లో యిల్లు చేరుకోవాలి!

పల్లాల్లో నిలిచిన బురదనీరు పైకెగిరి మడత చెరగని దుస్తుల్ని ఖరాబుచేస్తున్నా లెక్కచేయకుండా సూర్యం సందుల్లో పడి నడవసాగాడు. వానలో తడుస్తూ నడిచే అనుభవం సూర్యానికి క్రొత్త! అందులోనూ ఏటవాలుగా పడుతున్న వానచినుకులు వడగళ్ళలా ముఖాన్ని మొత్తుతున్నాయి. అధోముఖంగా శరవేగంతో వస్తున్న వర్షధారలమాటకేంగాని, అంతకంటే వేగంగా సూర్యం మనసులో ఆలోచనలు పరుగెత్తసాగాయి. ఐదారు నిమిషాల్లో తను గేటు తెరచుకుని లోపలికి వెళ్తాడు. మేడను సమీపిస్తాడు. సింహద్వారానికి తను వేసుకుని వచ్చిన తాళం ఈపాటికి పూడదీయబడివుంటుంది. నాన్నగారొక రివాల్వరు టేబిల్ సొరుగులో దాచివుంచడం మంచిదయింది. ఒకచేత టార్చిలైటు, మరొకచేత రివాల్వరు పట్టుకుని తను సరాసరి మేడపైకి వెళ్తాడు. తూర్పువైపుగదిలో దొంగ యినప్పెట్టె

తలుపు విడదీసే ప్రయత్నంలో నిమగ్నుడై వుంటాడు' మెరుపులా తను గదిలో ప్రవేశించి, టార్చిలైటును దొంగమీదికి ఫోకస్ చేసి 'హాండ్సప్' అని గర్జిస్తాడు. 'ఊఁ నడువెనక్కి' అంటూ వాడిని హాల్లోకి తీసుకొస్తాడు. స్విచ్ వేసి, పరుపు చుట్టుకునే త్రాడు వూడబెరికి దొంగని కంబానికి బంధిస్తాడు!

ఆక్షణంలో సూర్యం తను సూర్యమే నన్న విషయం మరచిపోయాడు. తనిప్పుడు తిమింగిలాలకు భయపడకుండా, తుపానుల్ని పరకు చేయకుండా సాగరాంతరాళంలోనికి చొచ్చుకుని వెళ్ళి ముత్తెపు చిప్పల్ని వెలికిదీసే సాహసికుడు! హిమపాతానికి వెరవకుండా, అలసటను లెక్క చేయకుండా అందుకోవలసిన ఆదర్శంపై చూపునిలిపి వడివడిగా నడక సాగిస్తున్న పర్వతారోహకుడు!

సందులోనుంచి సూర్యం మళ్ళీ రాజవీథిలోకి వచ్చేశాడు. అక్కడనుంచీ గేటుదగ్గిరికి నూరుగజాలు కూడా వుండవు. సూర్యం మేడవైపోసారి చూచాడు. జడివానలో చూపానడం లేదు. తీక్ష్ణదృక్కులతో గేటువైపు చూచాడు. అక్కడ మనిషివున్న పోలికవే కనిపించడం లేదు. ఆ ఉద్వేగంలో సూర్యం పిడికిలి మూసి చేతినిపైకెత్తి తన దృఢముష్టి నోసారి చూచుకున్నాడు.

కానీ సూర్యంచేయి అప్రయత్నంగా క్రిందికి వ్రాలిపోయింది. పిడికిలి తనంతటదే విచ్చిపోయింది. నిశ్చేష్టుడై అతడు గేటుకావలనుంచి వ్యాపించివున్న రావిచెట్టు కొమ్మలక్రింద నిలబడిపోయాడు. ఒకటి రెండు నిమిషాలపాటు తనచుట్టూరా వానకురుస్తోందనీ, వానలో తను బాగా తడిసిపోయాడని అతడు మరచిపోయాడు. అతడిశరీరంలోని ప్రతి రక్తబిందువులోని ప్రత్యణువునా తనఎదుట స్టూలుపైన నిశ్చలంగా కూచునివున్న ముసలివాడి పరిదీనస్వరూపమే ప్రతిబింబించింది. చీకటిలో కలిసి చీకటై, తడిసిముద్దైపోయి కూడా విసురుగా వీస్తున్న ప్రభంజనంలో, కుంభవృష్టిలో కదలకుండా, మెదలకుండా కూచునివున్న ఈ ముసలివాడినేనా తను దొంగఅని అనుమానించడం!

ఐదడుగుల పదంగుళాల పొడవున్న తనశరీరం ఆ వృద్ధుడి ధీరోదాత్తతముందు రెండడుగులమేరకు కుంచించుకపోయినట్టు తోచింది సూర్యానికి! అందుకతడు చింతించలేదు. ఆ ముసలాడి మహోన్నత వ్యక్తిత్వం మ్రోల తను మరుగుజ్జయిపోవడమే న్యాయం!

మళ్ళీ ఈలోకంలో పడ్డాక సూర్యం వృద్ధుడి దగ్గరగావెళ్ళి "తలనొప్పిగావుంటే అమృతాంజనం రాచుకుందామని వచ్చాను" అన్నాడు. తీరాఅన్న తర్వాత అలాఅన్నందుకు కించపడ్డాడు. అమృతాంజనంకోసం జడివానలో తడుస్తూ థియేటరునుంచి తనింతదూరం నడిచివచ్చాడంటే ఎవరు నమ్ముతారు? ఐనా తనిప్పుడెందుకు సంజాయిషీ చెప్పుకోవాలి? నిజానికది సంజాయిషీ కానేకాదు. తనచెవులకే అది క్షమాపణలా ధ్వనించింది...అంతలో సూర్యం తేరుకున్నాడు. ఏమయితేనేం! ముసలివాడికి తనమాటలు వినిపించివుండవు!

సూర్యం గేటుతెరచుకుని లోపలికివెళ్ళి ఐదు నిమిషాల్లో దుస్తులు మార్చుకుని తిరిగివచ్చాడు. అప్పటికి వాన దాదాపు వెలిసిపోయింది. ఐనా రావిచెట్టు కొమ్మల్లోనుంచి నిర్విరామంగా యింకా నీటిబొట్లు క్రిందికి రాలుతున్నాయి. బాహ్య వాతావరణంలో మార్పువచ్చినా ముసలివాడుమాత్రం నిర్వికారంగా సమాధిగతుడైనట్లు అలాగే కూచునివున్నాడు. సూర్యం కళ్ళల్లో నీళ్లు గిర్రునతిరిగాయి. చేతిగుడ్డతో కన్నీళ్లు తుడుచుకుంటూ సూర్యం క్షణక్షణానికీ మారిపోతున్న తన చిత్తపరివర్తనకు తానే తెల్లబోయాడు. గడచిన ఏడెనిమిదిరోజులుగా తనీముసలివాడినిగురించి యించుమించు రోజుకొక్క నిర్ణయానికి వచ్చాడు. అనుమానించాడు. అసహ్యించుకున్నాడు. జాలిపడ్డాడు. కడకిప్పుడు కంట తడిబెట్టుకున్నాడు. తనలో యిన్ని పరిణామాలు కలుగుతున్నా ఎదుటి మనిషిలోమాత్రం కించిత్తు మార్పయినా కనిపించడం లేదు. ఇది ఎండిపోయిన మ్రోడు. భూగర్భంలో దీని వేళ్లు చివికిపోయాయి పైనుంచి క్రిందికి కొమ్మలు క్రమక్రమంగా ఎండిపోతున్నాయి. ప్రకాండంలో తొర్రబడింది. ఈదుస్థితికి వెనుక ఎలాటి బలవత్తరమైన కారణం నిక్షిప్తమైవుందో తనకు తెలియదు. అథవా తెలిసినా తను చేయగలిగిందేమీ లేదు. దేన్ని గురించి విచారించి లాభంలేదో దాన్నిగురించి ఆలోచించడం వృథాప్రయాస!... సూర్యం రెండు పొడి బట్టల్ని ముసలివాడిపైకి విసరి, కట్టుకోమని సైగచేసి మళ్ళీ థియేటరువైపు వెళ్ళిపోయాడు.

మరునాటి ఉదయం, యిదివరకెప్పుడో నిర్ణయమైన ప్రోగ్రాంప్రకారం పూరీలోవున్న చంద్ర

శేఖరంగారికి సూర్యం జాబు వ్రాశాడు. 'పూజ్యులైన తండ్రిగారికి నమస్కారాలు' అంటూ ప్రారంభించి, సౌభాగ్యవతి నీరజ, చిరంజీవి పాప క్షేమంగా వున్నారని పేర్కొంటూ పిన్ని తృప్తికోసం ఆకుశలవార్తకు మరి నాలుగైదు వాక్యాలు జోడించాడు. "రోజుకొకటి రెండుసార్లు రాముడే పాపను షికారుకు తీసుకెళ్తున్నాడు. అందుచేత ఆమె నెత్తుకోడానికి ప్రత్యేకంగా కుర్రాణ్ణి పెట్టుకోవలసిన అవసరమేమీ కనిపించడంలేదు. మరొక విశేషం. మనకిప్పుడు నమ్మకస్థుడైన వాచ్ మేన్ దొరికాడు. పాపం, వాడిస్థితి హృదయవిదారకమైంది. చెవులు వినిపించవు. ఒక చేయి మొండిచేయి. సంవత్సరాలతరబడీ తిండికి నోచుకోనివాడిలా కనబడుతున్నాడు. రెండుపూటలా యింతతిండి పడేస్తే మరేధ్యాసలేకుండా ఆముసలివాడు మన యింటిదగ్గరే వుండిపోయేట్టున్నాడు. వాడు గేటుదగ్గరవుండడంమూలాన నేను క్లబ్బునుంచి రావడానికి కొంచెం ఆలస్యమైనా నీరజ మరేం కంగారుపడడంలేదు, ఈవిషయం పిన్నితో చెప్పండి"

* * * *

పది పదిహేనురోజులు మెల్లగా దొర్లిపోయాయి. ఈవ్యవధిలో సూర్యం రెండు మూడు పెద్దకేసులు వకాల్తా పుచ్చుకున్నాడు. వాయిదాలు దగ్గరలోవున్నాయి. తిండిశాస్త్రం ముగించి న్యాయశాస్త్ర ఉద్గ్రంథాలముందు కూర్చుండే ఒక్కొక్కప్పుడు అర్థరాత్రిగూడా మీరిపోతోంది. అప్పుడు పడుకుంటే ఏ ఎనిమిదికో, తొమ్మిదికో మెలకువవస్తుంది. అప్పటికి స్నానపానాలు ముగించుకొని కోర్టుకు చేరుకునేసరికి పార్కులో టవర్ క్లాకే పదిగంటలు చూపిస్తుంది.

ఇంతలో సూర్యం చుక్క త్రిప్పుకోడానికి వీలుగా వేసవిసెలవులు వచ్చాయి. ఫైళ్ళన్నీ కట్టగట్టి బీరువాలోకి విసిరి సూర్యం విశ్రాంతిగా కాలం గడపసాగాడు. పనిచేస్తే చురుగ్గాచేయడం, బద్ధకిస్తే అత్యవసరమైతే తప్ప రేయింబవళ్ళూ పడకపైనుంచి లేవకపోవడం సూర్యం అలవాటు. లేకంటే రాజకీయాలపైన వున్న పిచ్చివ్యామోహంవల్లనైతేనేమి, చేబట్టిన వృత్తిద్వారా లభ్యమైన వాక్కండూతిచేతనైతేనేమి సూర్యానికి క్లబ్బుకువెళ్ళి మిత్రులతో చర్చాకూపకమైన వాగ్వివాదానికిదిగకపోతే మరేంతో చేదగాను! అలావెళ్ళివస్తున్నప్పుడు గేటుదగ్గర ఆగి ముసలివాడిని పలకరిద్దామని సూర్యం చాలాసార్లు అనుకున్నాడు. ఆగి పలకరించేవాడే! కానీ మాట్లాడానికి ఆముసలాడు ఎంతమాత్రం సుముఖంగా కనబడలేదు. పైగా పనిలోచేరినప్పటికీ, యిప్పటికీ అతడు బాగా చిక్కిపోయాడు. వానలో తడిసిన నాటినుంచీ అతడికి కొత్తగా దగ్గొకటి సంక్రమించింది. ఉండి, వుండీ ఒక్కసారి దగ్గితే ఆదగ్గలా ధారావాహినిగా పది పదిహేను నిమిషాలవరకూ ఏకస్థాయిలో కొనసాగేది

"పన్నెండు గంటలకోసారి మేలుకున్నాను. అప్పుడు ముసలివాడి దగ్గు వినిపించింది" అనేవాడు తెల్లవారగానే సూర్యం.

"నేను తెల్లవారుఝామున మేలుకున్నానండీ! అప్పుడు కూడా ముసలాడు దగ్గుతూనే వున్నాడు" అనేది నీరజ.

"వాడు మనం మాట్లాడించినా మాట్లాడడు తనకు ఒళ్ళెలావుందని చెప్పుకోడు. ఏమిటోమరి! వీడు మనకొక సమస్యయిపోయాడు."

"దగ్గిదగ్గి వాడిక్కడే కళ్లుమూసుకుపోతాడేమోనండీ! ఎక్కడ పుట్టాడో, ఎక్కడపెరిగాడో వాడికి భగవంతుడిక్కడ చావు వ్రాసి పెట్టినట్టున్నాడు!"

ఆఖరుకు సూర్యం రాముణ్ణి పిలిచి ముసలివాడికెలావుందో తెలుసుకోమన్నాడు. అవసరమైతే హాస్పిటలుకు తీసుకెళ్లి మందిప్పించమన్నాడు.

కానీ వెళ్ళిన రాముడు వెళ్ళినట్టే తిరిగి వచ్చి "తాతగాడు తనకు మందూ గిందూ ఏమీ వద్దంటున్నాడు బాబూ" అన్నాడు.

"ఏం! ఎందుకని?" ఆశ్చర్యంతో ప్రశ్నించాడు సూర్యం.

"ఒంటిపైన చెయ్యివేసి చూశాను కాలిపోతోంది లేచి నిలుచోడానికైనా ఓపరికం వున్నట్టు లేదు. 'హాస్పిటలుదాకా రా! మందిప్పిస్తాను' అన్నాను"

"అందుకేమన్నాడు?"

"వెళ్ళిపో అన్నట్టు చెయ్యాడిస్తాడు బాబూ! ఇంకేమీ అనడు."

"ఒకవైపు ప్రాణం పోతున్నా మనయింటి దగ్గర కూమని సత్యాగ్రహం చేయడానికి వాడికి మనమేం

అపచారం చేశావట్రా రాముడూ! వెళ్లు. ఒక బండి తీసుకొచ్చి ఎద్దు వద్దన్నా వాడినందులో పడద్రోసి హాస్పిటలుకి లాక్కెళ్ళు. స్థితి అపాయకరంగా వుంది గనుక తప్పకుండా బెడ్ యిస్తారు. తక్షణం వాడిని హాస్పిటల్లో చేర్చి యింకొకపని చూడు, వెళ్ళు" అన్నాడు సూర్యం.

ఆరోజు మధ్యాహ్నానంతరం సూర్యం ముందు వాలోనుంచి రోడ్డువైపు చూచాడు. ఇనుపకమ్మీల గేటుదగ్గర కాపలావాడు లేడు! లోలోపల ఏదో అవ్యక్తమైన బాధ బాణంలా హృదయాన్ని గుచ్చుతున్నా పైకిమాత్రం తలపైన పెద్దబరువు తగ్గిపోయినట్టు 'అబ్బా' అని నిట్టూర్చాడు సూర్యం.

ఆకులకు సున్నం రాస్తున్న నీరజ సూర్యం లోపలికి రావడం చూచి "ఉదయం మీకొచ్చిన వుత్తరాల్ని టేబిల్ పైన వుంచానండీ" అంది. "నాన్నగారు వ్రాశారేమిటి?" అంటూ సూర్యం జాబుల్ని చేతికి తీసుకుని మంచంపైన పడుకున్నాడు. వాటిల్లో నాలుగైదు కార్డులు, ఒక కవరుమాత్ర మున్నాయి. చంద్రశేఖరంగారెప్పుడు వ్రాసినా ఒక కార్డులో ముక్తసరిగా మూడు మాటలు మాత్రం వ్రాస్తారు. ఆనాలుగు కార్డుల్లో మూడు క్లయింట్ల దగ్గరినుంచే వచ్చాయి. ఒకటి చందాగడువు మీరిపోతోందని హెచ్చరిస్తూ ఒకానొక పత్రికాకార్యాలయం నుంచి వచ్చింది. నాన్నగారు జాబువ్రాయలేదేమా అనుకుంటూ సూర్యం మిగిలిన కవరుపైకి తీశాడు. బహుశా ఎవడో క్లయింటు కేసుకు సంబంధించిన పత్రాలు పంపివుంటాడని కవరు చించాడు. కాగితాలు పైకి తీశాడు. ఉత్తరమంతటా నాన్నగారి అక్షరాలే వున్నాయి నాన్నగారు సుదీర్ఘమైన వుత్తరం రాయడానికి యిదే ప్రథమం. ఒకవేళ యాత్రానుభవాల్ని గురించి వ్రాశారేమో!

నాలుగైదు పేరాలు మాత్రం చదివి సూర్యం కాగితాల్ని చేతిలోవుంచుకునే పైకప్పుకేసి చూస్తూ ఆలోచనలో పడ్డాడు. ఆవుత్తరమంతా అదోతరహాగా వుంది! చెప్పవలసిన విషయమంతా ముందే వుండగా అందుకు పీఠికాప్రాయంగా వ్రాసుకపోతున్నారు నాన్నగారు. "ఇదంతా యిప్పుడెందుకు చెప్పవలసి వచ్చిందని నీకు సందేహంకలగవచ్చు. ఇంతకాలంగా నా అంతరాంతరాల్లో నిగూఢంగా దాగివుండిన ఈ రహస్యం నిన్ను మూలముట్టంగా కదిలించివేయవచ్చు! కాని సూర్యం! నాలో ఎన్నో తర్కవితర్కాలు జరిగినమీదటే ఈ వాస్తవాన్ని నీకు తెలియబరుస్తున్నానని నువ్వు గుర్తించాలి"

సూర్యం యించుమించు కొయ్యబారిపోయాడు. రహస్యమా? ఏమిటది? అది తనని కదిలించివేసే వాస్తవమా! అలాటి దొకటుంటుందని అనుకోడానికైనా అవకాశంలేదే! నాన్నగారేదైనా కథవ్రాసి పత్రికకు పంపించడానికి బదులు తనకు పంపించేశారా! కాదే. పైన చిరంజీవి సూర్యానికి శుభాశీస్సులని స్పష్టంగా వ్రాశారే!

సూర్యం మళ్ళీ ఉత్తరాన్ని చూడసాగాడు. తరువాతి ఒకటి రెండు పేజీలవరకూ జాబు వింతగా వేదాంతధోరణిలో సాగిపోతోంది.

"నీకు తెలుసు సూర్యం, నేనూ నీలా న్యాయవాద వృత్తి అవలంబించిన వాణ్ణి. పదేళ్ళపాటు న్యాయమూర్తిగాకూడా పనిచేశాను. ఆముప్పై, ముప్పైఅయిదేళ్ళ అనుభవంలో నాకవగతమైన సత్యమొక్కటే! న్యాయాన్ని నిర్ణయించడంకంటే ఈ ప్రపంచంలో అసిధారావ్రతం మరొకటిలేదు. ఉదాహరణకి నీకీరహస్యం చెప్పడం న్యాయమా కాదా అని నేనీ పది, పదిహేను రోజుల పొడుగునా వితర్కించుకున్నాను పూరీలో జగన్నాథుణ్ణీ, కలకత్తాలో కాళీమాతను, కాశిలో విశ్వనాథ శివుణ్ణి దర్శించుకున్నప్పుడు కూడా ఈ సందేహమే నాలో కొట్టుమిట్టాడింది. కడకు ఈ విషయాన్ని నీకెరిగించడమే న్యాయమన్న నిర్ణయానికివచ్చాను. ఈ జాబు వ్రాస్తున్నది నేను బృందావనంనుంచి! నిన్నసాయంత్రం ఈ రహస్యాన్ని ప్రకటించడానికి కావలసిన ఆత్మసంయమనాన్ని ప్రసాదించమని నేను కృష్ణభగవానుణ్ణి వేడుకున్నాను.

నా పరిస్థితిలో వున్నవాడు మరెవ్వడైనా అయితే నీకీ విషయాన్ని చెప్పేవాడు కాడేమో! కానీ అలాటివాడు నా కాదర్శం కాడు. నేనులోకం మెప్పుకోసం ఆశించకుండా నాకు న్యాయమని తోచిన కార్యాలు కొన్ని చేశాను. వాటిల్లోయిది ఆఖరుదిగావుండనీ! ఇదే నాకోరిక.

మీ పిన్నికి కథలపిచ్చి ఎక్కువ. కనిపించిన పత్రికలన్నీ కొని తెమ్మని మొదట కథల్ని మాత్రం

చదివేయడం యిప్పటికీ ఆవిడ అలవాటు. అందులోనూ ఎక్కడో అరుదుగా కనిపించే విచిత్రమైన మానవ ప్రవృత్తి యథాతథంగా చిత్రింపబడే కథలంటే ఆమెకు ఎక్కువ అభిమానం. అలాటి కథల్ని ఆమె చదువగా నువ్వూ, నేనూ అప్పుడప్పుడూ వింటుండే వాళ్ళం. నీకు జ్ఞాపకం వుందో లేదో గానీ ఒకసారి ఆమె ఒక కథ చదివింది రాక్షసుడిలాంటి మనిషి ఒకడుంటాడు, వాడు చేయని కిరాతకకృత్యాలు లేవు తను చేసినవన్నీ దుష్కార్యాలేనని వాడికీ తెలుసు. కానీ వాడందుకు పశ్చాత్తాపపడడు పైగా వాడెన్ని ఘోర కృత్యాలు చేసినా లోకుల్లో వాడి అంతస్థు నానాటికీ పెరిగిపోతుంటుంది. కడకు తనూ కొంతవరకూ ప్రపంచాన్ని వుద్ధరించినట్టు ఆత్మసంతృప్తితో వాడు చనిపోతాడు. ఈకథ అసహజంగా వుందని నువ్వూ, మీ పిన్నీ వాదించారు. నేను మాత్రం యిది సహజమేనని మీకు నచ్చజెప్పబోయాను. కారణం, మీకంటే నేను లోకాన్ని ఎక్కువగా చూచినవాణ్ణి. అదే పనిగా మానవుల్ని హతమార్చిన హంతకులు కొందరు పాప పరిహారార్థం రెండు అశ్రుబిందువులైనా ధారబోయకుండా ఉరికంబాన్ని సమీపించడం నేనెరుగుదును. వాళ్లు రాక్షసులు! వాళ్ళతో మనకు ప్రసక్తి లేదు.

ఐతే మానవుల సంగతేమిటి? నా ఎరుకలో ఒక మనిషివున్నాడు. వాడిని నేను దాదాపు నాలుగు దశాబ్దాలనుంచీ చూస్తున్నాను వాడు సంఘానికి చీడపురుగుగా బ్రతికాడు. మానవతుల శీలానికి ముప్పుగా బ్రతికాడు. నిరంతర దుర్వ్యసనాల్లో ఆస్తిని గుల్ల చేసి పారేశాడు. చిప్పచేతికొచ్చింది కాని వాడు మానవుడు మాత్రం కాలేదు. మానవుడైతే వాడికి పశ్చాత్తాపం కలగదా అనుకున్నాను. వాడిక మానవుడు కాలేడనుకున్నాను. కాని నువ్వింతలో ఆ మొండిచేతి ముసలి వాణ్ణి గురించి జాబు వ్రాశావు. అంతటితో నా అంచనా తారుమారయింది.''

సూర్యం తృళ్లిపడ్డాడు. అక్కడికీ, యిక్కడికీ వచ్చి ఈ మొండిచేతి ముసలివాడు తనకథలో నే ప్రవేశిస్తున్నాడు!

"ఇప్పటికే నాయీలేఖ నిన్ను చీకాకు పరుస్తోంది గదూ సూర్యం! లేనులే అసలు విషయాన్నిక డొంకతిరుగుళ్లు లేకుండా నాచేత నయినంతవరకూ సంగ్రహంగా వ్రాయడానికి ప్రయత్నిస్తాను. ఏకాంతంగా కూచుని తీరిగ్గా చదువుకో.

సూర్యం ఉత్తరాన్ని జేబులో వుంచుకుని చరచరా మేడపైకి వెళ్ళాడు గదితలుపులు మూసి కుర్చీలో కూచుంటూ మళ్లీ కాగితాల్ని పైకి తీశాడు.

* * *

"అవి నేను క్రొత్తగా కాలేజిలో చేరిన రోజులు. కాని అప్పటికే ఈ ప్రపంచం ఆనందధామమేమీ కాదని, కావలసినన్ని కష్టనష్టాలకిక్కడ కొఱతలేదనీ నాకు బాగా తెలుసు. మా నాన్నగారు నన్నలా పెంచారు. అందుకాయనని లాభంలేదు. పిత్రార్జితంగా దక్కిన ఆస్తిపాస్తులంతగా లేకపోయినా ఆయన అంతవరకూ సంసారాన్ని లాక్కురావడమే గొప్ప విశేషం. బాగా చదివి, డిగ్రీలు సంపాదించి, నేను పెద్దఉద్యోగం చేస్తుంటే ఒకసారి చూచి చనిపోవాలని నాన్నగారప్పుడప్పుడూ అంటుండేవారు. ఆయన కోరికలోని పూర్వాపరభాగాల్లో మొదటిదైతే నెరవేరింది గానీ రెండోది నెరవేరకముందే ఆయన శాశ్వతంగా కళ్ళు మూసుకున్నారు.

ఉన్నవూళ్ళోనే హైస్కూలుండడం మూలాన స్కూల్ ఫైనల్ వరకూ నా చదువు మా నాన్నగారికి బరువుగా తోచలేదు. వెనుకా ముందూ చూడకుండా రెండువందల రూపాయలు అప్పుచేసి ఆయన నన్ను కాలేజికి పంపించారు. ట్రంకు చేతోపట్టుకుని అనంతపురం స్టేషనులో దిగాను. ఆవూరి ముఖం చూడ్డానికి అదే తొలిసారి కాలేజి ఎక్కడవుందో వాకబు చేసుకుంటూ వెళ్లాను. ప్రిన్సిపాలు గారు సాదరంగా మాట్లాడి ఈవూళ్లో ఎక్కడుండదలచుకున్నావు" అని అడిగారు. "అదే తెలియడంలేదండీ" అన్నాను. ఆయన చీటీలో ఒకపేరు వ్రాసియిచ్చి అక్కడికి వెళ్ళమన్నారు.

అది రంగమ్మ హోటలు! ఆరోజుల్లో ఆచుట్టుప్రక్కల భోజనప్రియులందరికీ రంగమ్మ ఆరాధ్య దేవత. హోటలని పేర్కొంటున్నారు గనుక అక్కడ కుర్చీలు, బల్లలు, పటాలు, పంకాలు, సర్వర్లూ క్లీనర్లూ వుంటారనుకున్నాను, కాని అక్కడ అలాంటి గందరగోళ మేమీ లేదు పాడుగూళ్ళనుంచి వచ్చి చదువుకుంటున్న కాలేజి కుర్రాళ్ళు చాలా మట్టుకు అక్కడే భోంచేస్తారు. పైసామాపిస్తే చాలు,

రంగమ్మకు పోయిన ప్రాణంకూడా చక్కా లేచి వస్తుందని లోకంలో ఒక ప్రథ వుండేది. నాటికి తొంభైమందికి సర్వసామాన్యంగా వర్తించే ఆమాట కేంగానీ రంగమ్మ పరిచర్యలతోనూ, అంతకంటే మాటలతోనూ వాడుగ్గా తినేవాళ్ళకందరికీ స్వర్గ హోన్ని మరపించేది. నాలుగైదు రోజులు ఆ హోటల్లోనే ఓగదిలో మకాంపెట్టి చూచాను. బొత్తిగా చదువుకోడానికి వీలుగా వుండలేదు. ఎప్పుడూ ఎడతెగని జనం. ఇలా కాదనుకుని ప్రత్యేకంగా వున్న ఓ గదికోసం అన్వేషణ ప్రారంభించాను.

ఆనాటికి అనంతపురం యిప్పుడున్నంత పెద్ద బస్తీకాదు. నాలుగైదు ముఖ్యమైన వీథుల్ని మినహాయిస్తే మిగిలిన వూరంతా వట్టి మట్టిమిద్దెల మయం. ఈ మంటిమిద్దెలు డిటెక్టివు నవలల్లో అప్పుడప్పుడూ అపరాధపరిశోధకులకు తటస్థించే భూగర్భగృహాల కంటే ఒకించుక మెరుగ్గా వుండేవంతే! ఒకటి రెండు అంకణాల వెడల్పున ఈవీథినుంచి ఆవీథివరకూ నూరు నూటయాభై గజాల పొడుగునా వ్యాపించివున్న ఈ మంటిమిద్దెలకు ఏవైపునగానీ ఓకిటికీవుండదు. ఉత్తర ధృవంలో మానవులకు ఆరునెలలు పగలు, ఆరునెలలు రాత్రి అని భూగోళం చెబుతుంది. కాని ఈ మట్టిమిద్దెల్లో మనుషులు మాత్రం సంవత్సరమంతా చీకటిలోనే బ్రతుకుతారు. జీవించడమే కష్టసాధ్యమైన ఈయిళ్ళల్లో యిక చదువుకోవడమేం కుదురుతుంది?

నాలుగురోజులు అదేపనిగా తిరగ్గా, తిరగ్గా కడకు ఓమారుమూలవీథిలో గది దొరికింది. పెంకుటింట్లో వీథివైపు గది. గదిలోపలికి గాలీ వెలుతురూ వచ్చే అవకాశాలున్నాయి. మాటి మాటికీ గదిలోకి వచ్చి అల్లరిచేయడానికి ఆ యింట్లో కుర్రాళ్లుకూడా లేరు. కుర్రాళ్ళే ఏమిటి, మగవాళ్లుకూడా లేని ఆ యింట్లో యిద్దరు ఆడవాళ్లు మాత్రం వున్నారు. ఊతకర్రసాయంతో ముసలావిడ రోజుకొకటి రెండుసార్లయినా వీథిగడపదాకా వచ్చి నన్ను పలకరించి వెళ్ళేది. ఆవిడకు పగలుమాత్రం ప్రపంచం మసకమసకగా కన్పిస్తుంది. రాత్రులు అదీలేదు! పెరట్లోకి ప్రత్యేకంగా దారిలేకపోవడంచేత ముఖం కడుక్కోడానికీ, స్నానం చేయడానికీ యింటిలోపలి నుంచే వెళ్లివలసి వచ్చేది. లోపలికి వెళ్లినప్పుడల్లా నడవలో మంచంపైన పడుకునివున్న ముసలావిడ "ఎవరూ, ఎవరూ" అంటూ కంగారుగా ప్రశ్నించేది. "నేనేనవ్వా! చంద్రాన్ని" అనేవాణ్ణి. "ఒసే జానకీ! అబ్బాయికి నీళ్లు కావాలేమో, తొట్లోవున్నాయేమో చూడు" అంటూ ఆవిడ కూతురికి పనిపురమాయించేది. ఆ అమ్మాయి తొట్లోనీళ్ళువుంటే వున్నాయనేది. లేకుంటే మారుమాట చెప్పకుండా నీళ్లుచేది పోయడానికి గజ్జెలగుర్రంలా నడుస్తూ పెరట్లోకి వెళ్ళిపోయేది. ముక్కూ మొగం ఎరుగనివాళ్ళచేత పనులు చేయించుకోడానికి నాకు బొత్తిగా మనస్కరించేది కాదు. ఐనా అడ్డుచెప్పలేక జానకి నీళ్లుచేది పోసేంత వరకూ ముసలావిడతోనే మాట్లాడుతూవుండి ఆ తరువాత పెరట్లోకి వెళ్ళేవాణ్ణి.

ఓరోజు నేను కాలేజినుంచీ రావడానికి ఆలస్యమైంది. నాకోసం వీథిగడప దగ్గరే కాచుకునివున్న ముసలావిడ "ఏం నాయనా, ఈరోజింత వేళమీరి వచ్చావు" అంది. కారణం చెప్పాను. ఏమో బాబూ! రోజు ప్రొద్దుండగానే యిల్లు చేరుకునే వాడివి. ఈ రోజు రాకపోయేసరికి దిగులేసింది. ఇది మగదిక్కు లేని యిల్లయిపోయె! ఏఅమ్మకన్న బిడ్డవో నువ్వూ మాలో ఒకడివిగా మసలుకుంటున్నావు. ఈ రోజు మాఅబ్బాయికి తిథిచేశాను. బ్రతికుంటే వాడీపాటికి ఒకయింటివాడై జానక్కికూడా పెళ్ళిచేసి వుండేవాడు. రోగమా, రొష్టా? ఏమీ లేదు. ఆ దేముడికి కళ్ళు గుట్టినయ్. తీసుకెళ్లిపోయాడు. వాడికి జానకంటే పంచప్రాణాలు. అమ్మా లేకపోయె, అన్నా లేకపోయె, నేనున్నా లేనిదానిక్రిందే జమ. దాని అథం, శుభం ఎవరు చూస్తారు?"

జీవిత ప్రవాహంలో అనేక సుడిగుండాల్లోపడి మునిగి తేలి గుక్క తిప్పుకున్న ఆముసలావిడను నేనేమని ఓదార్చగలను! ఐనా ఆమె తృప్తికి "అవును, పాపం, నిజమే మరి" అంటూ నిట్టూర్చాను.

"బ్రతికుంటే వాడు తన అత్తగారింటికి వస్తే వాడికి ఏరికోరి వంటకాలు చేసిపెట్టవలసింది జానకి. వాడికేవది యిష్టమో నాకంటే దానికి బాగా తెలుసు. పిచ్చిపిల్ల! వద్దన్నా ఈరోజు అవన్నీ చేసింది. దాని పిచ్చిగానీ, వాడొచ్చి తినబోతాడా బాబూ!"

ఈ ఆవేదన ఉపశమించడానికి ఏంచెప్పాలో నాకు తర్జించుకున్నా స్ఫురించలేదు.

"పోనీ ఈపూట నువ్వు హోటలుకు వెళ్లక పోతేనేం బాబూ! ఇక్కడే భోంచేయ కూడదూ!"

"దానికేం అవ్వా! తప్పకుండా భోంచేస్తాను" అన్నాను.

ముసలావిడ మెల్లగా లేచి గోడవెంబడే నడవ లోకి వెళ్లి మంచంపైన కూచుంది. నేనూ నడవలోనే భోజనానికి కూచున్నాను. జానకి పళ్లెంలో అన్నం తెచ్చింది.

"మహారాజు, ఆయన చనిపోయినా మాకంతో యింతో మిగిల్చి పోయాడు. ఈయిల్లూ, వాకిలీ గాక నాలుగైదెకరాల పొలముంది. కాలుమీద కాలు వేసుకుని యింట్లో కూచున్నా సాలుకు అయిదొందల రూపాయల ఆదాయ మొస్తుంది. ఇది గాక వున్నదిగా నట్రా వుండనేవుంది. సంబంధం కుదిర్చి పెట్టి ముందునిలిచి శుభకార్యం చేసేవాళ్ళే లేంది!"

"ఆ ఘడియ వస్తే సంబంధం తనంతటనే వెతుక్కుంటూ వస్తుంది" అని ప్రయత్నించి ఓమాట న్నాను.

కొంతసేపు పరధ్యానంగా వుండిపోయిన తర్వాత ముసలావిడ "అన్నం ఇంకా కావాలో చూస్తున్నావా జానకీ" అంది.

"ఆకులో మొదట వేసిన అన్నం యింకా అలాగే వుంది" అంది జానకి, అప్పటికి నేనేదో అపరాధం చేసినట్టు.

"ఇది మరీ బాగుందవ్వా! జానకిని వృకోదరుడు లాంటి వాడికెవరికైనా కట్టబెట్టాలి! లేకుంటే అతగాడు మొదట వేసిన అన్నమైనా పూర్తిగా తిని నిభాయించుకోవడం కష్టం" అన్నాను

జానకి కిలకలా నవ్వుతూ రెండోదఫా పళ్లెం నిండుగా అన్నం తెచ్చింది.

జానకి అంత పొడుగరీ కాదు. పొట్టీ కాదు. నీటి యెద్దడిలేని బావిక్రింద, పుష్టిగా సత్తువ గలిగిన నల్లరేగడ పొలంలో గుమ్మటంలాగా పెరిగే అరటిచెట్టులాంటి అంగసౌష్ఠవం ఆమెది! నిజానికి జానకి దేమంత అపురూపమైన సౌందర్యం కాదు. అంతమాత్రం రూపవతులు మనకెక్కడైనా కనిపిస్తారు. సౌందర్యం కన్నా ప్రధానంగా ఆమె చూపుల్లోనూ, మాట్లాడే తీరులోనూ ఎదుటివారికి కొట్టొచ్చినట్లు కనిపించేది ఆమె అమాయికత్వం. హృదయంలోనుంచి పెల్లుబికిన భావాన్ని గళంలోనే మింగి, మెరుపులా హఠాత్తుగా పుష్పించే దరహాసాన్ని పెదవులపైకి వచ్చీరాకముందే తుడిచిపెట్టి తెచ్చికోలు అభినయంతో కృత్రిమంగా ప్రవర్తించడం జానకికి బొత్తిగా చేతగాదు. ఆమె ఏమాట చెప్పినా అది భూగర్భంలోనుంచి అప్రయత్నంగా పైకి ప్రసరించే జలధారలా, స్వచ్ఛంగా రమణీయంగా ధ్వనిస్తుంది. ఎంతమాత్రం ఛలోక్తికయినా ఆమె గలగలా నవ్వేస్తుంది. ఆనవ్వు శరత్కాల కౌముదిలా చల్లగా, తెల్లగా విరిసి ఎదుటివారికి హాయిహాయి అనిపిస్తుంది. పదిపదిహేను రోజులకు ముందు జానకి నాకు క్రొత్త నేను జానకికి క్రొత్త. కానీ ఆమాట, ఆనవ్వూ ఈ స్వల్ప వ్యవధిలో కొత్తదనాన్ని మటుమాయం చేసి పారేశాయి

"అమ్మాయీ, జానకీ!" అని సంబోధించే వాణ్ణి తమాషాకు.

"ఏమండీ అన్నయ్యగారూ!" అంటూ జానకి వాగ్వాదానికి సిద్ధమయ్యేది.

"మరేం లేదు. ఈరోజొక పెళ్ళి సంబంధం చూచానులే" అంటూ ఆమె ఎలా వుడుకుమోత్తనం వ్యక్తపరుస్తుందోనని నిలువెల్లా కళ్లు చేసుకుని ఆమె వైపు చూస్తూ వుండిపోయేవాణ్ణి.

"చూస్తారు, చూస్తారు! చూడకేం! అవ్వో, సవ్వో చేసి తమ్మిన్నింత దూరం పంపించింది యిక్కడెవరికో పెళ్లి సంబంధాలు చూడ్డానికి కాదు. బుద్ధిగా చదువుకోండి"

"అదికాదు జానకీ! మరినీకు నేను చూచిన వరుడున్నాడు మాచావూ, అతడు అమాంతం నీతలకాయంత యినపగుండును యిరవైబారల దూరానికి విసిరి పారేస్తాడు! వాడి ఛాతీ వుందిరా బాబూ, పిరంగులు పెట్టి కాల్చుకోనీ చెక్కుచెదరదు. అంతేకాదులే జానకీ! వాడి భోజన పరాక్రమం గూడా చెప్పకో దగ్గదే! నువ్వు ఒకదానివెంబడి ఒకటిగా ఐదు విస్తర్లు వేసినా ఊఁ ఆఁ అనకుండా అన్నీ ఖాళీచేసి గానీ లేవడు."

చిరుకోపం ముఖంలో పరవళ్లు త్రొక్కగా, ఒక్క విసురున పైకిలేచి ముందుకు పోయి ఈ భుజం మీదినుంచీ ఆభుజంమీదికి విల్లులా పడుతున్న పొడుగాటి జడను వెనక్కి తీసుకుంటూ జానకి తల్లి దగ్గరకు

వెళ్ళి "చూడవే అమ్మా! అన్నయ్య ఎవణ్ణో బకాసురుణ్ణి తీసుకరాబోతున్నాడు" అంటూ ఏడుపు ముఖం పెట్టేది.

"అదేమోనమ్మా! మీ అన్నా నువ్వు పడండి, లేవండి! నాకు తెలియదు. అతడు బకాసురుణ్ణి తెచ్చినా సరే, భీముణ్ణి తెచ్చినా సరే నువ్వు పెళ్ళి చేసుకోవలసిందే" ముసలావిడ తనతీర్పు తేల్చి చెప్పేసేది.

"చేసుకుంటాలే మీరు మాద్దురు గానీ! ముందు అట్లకాడ పొయిలో పెట్టి నాలుగువాతలు తీస్తాను. ఎంతభీముడైనా ఒళ్ళు కాలి నోరు బాదుకుంటాడు."

ఓరోజు సాయంత్రం ప్లేగ్రౌండునుంచి యింటికి వచ్చి, స్నానం చేయడానికి పెరట్లోకి వెళ్ళాను. తొట్టిలో నీళు లేవు. నాకెందుకో కోపం వచ్చింది! చేదను బావిలో వేసి చేంతాడు జార విడుస్తున్నాను. చేద నీరికి తగిలిన శబ్దం వినిపించిందేమో, జానకి లోపలినుంచీ పరుగెత్తుకుని వచ్చింది.

"అదేమిటి? ఎప్పుడూ లేని వాడుక!

నేను వెనుదిరిగి చూడలేదు నాపాటుకు నీళ్ళు తోడి తొట్లో పోస్తున్నాను.

"పోసింది చాలు. ఇక స్నానం చెయ్యొచ్చు" అంది జానకి.

చేత చెంబు తీసుకుని తొట్లో ముంచబోయాను. పట్టిగాల్లో చెంబే మునుగుతుంది! తొట్లో ఒక్క చుక్క నీళ్ళుకూడా లేవు.

"అబ్బాయిగారి కలాగే కావాలి! కోపమొస్తే మాత్రం క్రింద తూము మూసిందీ లేందీ చూచుకో వద్దూ" అంటూ జానకి మొదట తూము మూసి తరువాత చేద చేతికి తీసుకుంది.

"నాకొకరిమీద కోపమెందుకొస్తుంది?" అన్నాను.

"ఎందుకొచ్చిందో చేదనడిగితే తెలుస్తుంది. పాపం, అది కుయ్యో, మొర్రో అని మొత్తుకుంటుంటే పరుగెత్తొచ్చాను"

"ఐతే నువ్వు చేద ఏడుస్తోందని పరుగెత్తొచ్చావు గానీ, నేను బాధపడుతున్నానని కాదు"

"అయ్యో ఎవ్వారమా! ఇవేం ఎత్తిపొడుపులమ్మా! ఇలా రాచి రంపాన బెడితే ఆ రాబోయే వదినగారిగతి ఏం కావాలో ఏమిటో!"

రాబోయే వదినగారినిగురించి మాట్లాడ్డమంటే జానకికి సరదా! ఆమె నోటంట ఆ మాటలు వినడానికి నాకూ సరదాగానే వుండేది! అసలు జానకిని చూచినతర్వాతనే ననుకుంటాను, నాకు పెళ్ళి చేసుకోవటం కూడా ఒక మంచిపనేనన్న అభిప్రాయం కలిగింది. జానకిలాంటి సహచారిణి దొరికితే ఎలాంటి దుర్గమపథంలోనైనా సునాయాసంగా ప్రయాణం చేయవచ్చు. కానీ జానకిలాంటి అమ్మాయి దొరకడమే దుస్తరం! అలాటివాళ్ళు నూటికీ కోటికీ ఒకరుంటారో, వుండరో!

దసరాలోనూ, క్రిస్మస్‌లోనూ రెండుసార్లు ఊరికి వెళ్ళివచ్చాను. వారానికోసారైనా జానకి వుత్తరం వ్రాసేది. క్రిస్మస్ సెలవుల చివరి రోజుల్లో జానకిదగ్గరినుంచీ ఓ వుత్తరం వచ్చింది. అందులో ఈసారి నేను అనంతపురం వచ్చినమీదట హోటలు తిండి మానేయాలని, అలా మానకుంటే గదైనా ఖాళీచేసేయాలనీ తనతల్లి నిక్కచ్చిగా చెబుతున్నట్టు ఆమె వ్రాసింది. ముసలావిడ అలాటి నిర్ణయానికి రావడంలో ముప్పాతిక మువ్వీసం బాధ్యత జానకిదై వుంటుందని నాకు తెలుసు. కానీ నేనెందుకో చొరవతీసుకుని ఆ తల్లీకూతుళ్ళు చెప్పినట్టు చేయలేకపోయాను "ఎలాగా వారానికి రెండుమూడు పూటలు యిక్కడే భోంచేస్తున్నాను. ఇక స్నానపానాదులన్నీ మీరే చూచుకుంటున్నారాయె. ఐనా నాకేం అభ్యంతరం లేదు. కాని నాన్నగారు నామూలంగా ఒకరికి శ్రమకలిగితే ఒప్పుకోరు" అని వాళ్ళకు నచ్చజెప్పుకున్నాను.

మార్చినెలసమీపం కావస్తోంది. చదువుల గొడవలో మునిగిపోయినందువల్ల మునపటిలా జానకితో మాట్లాడ్డానికి తీరికయ్యేదిగాదు. కాని వీలు చిక్కినప్పుడల్లా జానకి గదిలోకే వచ్చేసేది. ఆ యింట్లో కుర్రాళ్ళు లేనందువల్ల నెమ్మదిగా చదువుకోవచ్చునని మొదట నే నాశించాను కానీ మాటల్లోనూ, చిలిపితనంలోనూ ఒక్క జానకే పదిమంది కుర్రవాళ్ళ పెట్టు! "బొత్తిగా తెగడ లేదన్నయ్యా! ఈ పుస్తకం తీసుకుపోతున్నా" అంటూ ఆవిడ నా యిండియన్ హిస్టరీ వాల్యూమును చేతికి తీసుకునేది. "పరీక్షలొచ్చేస్తున్నాయి జానకీ, నీకు పుణ్యముంటుంది. దాన్నక్కడ పెట్టి వెళ్ళు" అని ప్రాధేయపడేవాణ్ణి.

"ఇన్ని పుస్తకాలున్నాయే, యివన్నీ చదివితే చాలదూ" అంటూ జానకి కిటికీకి ఎదురుగా కూచునేది. నేను పుస్తకం మూసిపెట్టి "వంటాగింటా మాని నువ్విక్కడి కెందుకొచ్చావో, ఒకటిరెండు మాటల్లో చెప్పెయ్ జానకీ! నేను చదువుకోవాలి" అనేవాణ్ణి.

"ఇన్ని పుస్తకాలు చదువుతావు గదా! ఒకకథ చెప్పగూడదూ పోనీ"

"వీటిల్లో కథలుండవు జానకీ! అంతా చరిత్ర"

"పోనీ ఆచరిత్రే కొంచెం చెప్పన్నయ్యా! వింటాను"

నేను పక్కన నవ్వేసేవాణ్ణి. జానకి నాతో బాటు నవ్వేది. వీధంట వెళ్ళేవాళ్లు మమ్మల్ని ఆశ్చర్యంగా చూచేవాళ్లు, ఇరుగింటి,పొరుగింటివాళ్లేమను కునేవారో నాకు తెలియదు. కాని జానకి ఎవరినీ లెక్క పెట్టేదికాదు.

ఆ తల్లీకూతుళ్లని చూస్తుంటే ఆకుటుంబానికి, మిగతా ప్రపంచానికి మధ్య లంకె లెప్పుడో విచ్ఛిన్నమై పోయినట్లు తోచేది. ఒక విధంగా వాళ్లది ఒంటరి జీవితం. జానకి మేనత్తగారు ఆవూళ్ళోనే వున్నారు. ముసలావిడ మాటల్లో ఒక్కొక్కప్పుడు వూళ్లో నాలుగో వీధిలోనే వున్న ఆబంధువులని గురించి ప్రసక్తి వచ్చేది. వాళ్లు కొత్తగా కారుకొన్నారు. మేడకట్టించారు. పెద్దవ్యాపారం సాగుతోంది. ఆమేనత్తకు ఒకే ఒక కొడుకున్నాడు. కాపురాలు రెండూ ఒకే పాయలో వున్నప్పుడు అతడికి జానకిని చేసుకోవాలని వాళ్ళు చెబుతుండేవారు. నడిమంతరపుసిరిలో ఆ బంధుప్రేమ మండుటెసుకలో జలకణంలా యింకి పోయింది. వాళ్ళిప్పుడీ వూళ్లో బంధువులున్నారని భావించడంలేదు.

"వాడిని నువ్వూ, ఎప్పుడైనా చూచేవుంటావు చంద్రం: మరేంపనిలేదు. వీధుల్లో తిరుగుతుంటాడు. వాడిసంగతి నేను చెప్పడం బాగుండదు. ఊళ్ళో ఎవర్నడిగినా నీకు తెలుస్తుంది. వాసు వస్తున్నాడంటే ఇక వయసు ఆడపడుచులు యిళ్లల్లో దూరి గడెవేసు కుంటారు" అనేది ముసలావిడ.

"ఎవరెట్లాపోతే మనకేమే అమ్మా! అతగాడైనా ఈమధ్యనేగా యింత అధ్వాన్నంగా తయారైంది! ఐనా ముక్కుదాడు లేకపోతే కోడెదూడ చెప్పిన మాట వింటుందీ?" అంటూ చర్చలో పాల్గొనేది జానకి.

"ముకుదాడుకేం! నువ్వున్నావుగా! నీకంటే మంచి ముకుదాడు ఎక్కడ దొరుకుతుంది జానకీ! నేను చెబుతున్నా నవ్వా, ఆకోడెకు ఈముకుదాడు తగిలిస్తే పొగరణిగిపోతుంది" అంటూ నేను వుచితంగా సలహాయిచ్చేవాణ్ణి.

"నేనైతేనా! చెవులుమలిమి గదిలో కూలద్రోసి అతగాడిచుట్టూ గిరిగీసేదాన్ని! ఏమనుకున్నావో"

అదేం ఆత్మవిశ్వాసం! ఈ ప్రపంచంలో తనకు అసాధ్యమైన పనంటూ ఒకటి లేనేలేదనుకుంటోందా ఈ జానకి! ఏమో, నా కర్థమయ్యేది కాదు.

ఆత్మవిశ్వాసం సంగతలావుండగా ఆమె యితరుల్నిగూడా అంత దృఢంగానే విశ్వసిస్తుంది.

అదే ఆమెకొంప ముంచింది.

సంక్రాంతి పండుగతర్వాత నాలుగైదురోజులై వుంటుంది. ఆరాత్రి బాగా ప్రొద్దుపోయేంతవరకూ చదువుతూవుండిపోయాను. తాలూకా కచ్చేరిలో జవాను పన్నెండు గంటలు కొట్టాడు. నాలుగంటలకు అలారం పెట్టి, దీపం చిన్నదిచేసి చాపపైన పడు పడుకున్నాను. ఇంకా తల్లో గ్రీకుదేశ రాజకీయ కల్లోలాలు, ఆంగ్లేయుల గులాబీపూల యుద్ధాలు, హిందూదేశంలో మహమ్మదీయ దండయాత్రలు కలగాపులగంగా సుళ్ళు తిరుగుతున్నాయి. నిద్రాదేవి పూనకంలో క్రమక్రమంగా బుర్ర వేడి తగ్గుతోంది. ఇంకొక అయిదునిమిషాల్లో గాఢంగా నిద్రపట్టి వుండేదేమో! వీధిమెట్లపైన ఏదోశబ్దం వినిపించింది. ఎవరిదో పదధ్వని! అదేవీధిలో అప్పుడప్పుడూ దొంగతనాలు జరుగుతుంటాయి. కాస్తా జాగ్రత్తపడడం ఎందుకైనా మంచిది. దీపం హెచ్చించడానికి చేయిచాచాను. కానీ లాంతరుచేతికింకా ఒక మూరదూరంలో వుండి పోయింది.

నేను పడుకున్న గదికిఎదురుగా వరండావుంది. వరండాలో గదికిప్రక్కగా పాతకాలంనాటి నగిషీ పనులద్వారబంధమూ, గడ్డపారలకైనా భయపడని తలుపూ వున్నాయి. సింహద్వారానికి అటువైపున రెండుగజాల్లో లోపల గదివైపుకు తెరచుకునే రెండు తలుపుల కిటికీ ఒకటివుంది. కిటికీకి బలమైనకమ్మీ

లున్నాయి. వీధివైపునుంచి దొంగ యింట్లో ప్రవేశించడం అసాధ్యం. కంగారుపడి ఆవచ్చిన దొంగను బెదరగొట్టడ మెందుకని దీపం పెద్దది జేసే ప్రయత్నం మానుకున్నాను.

గదిలో పడుకునే, వరండాలో ఏం జరుగుతోందో తెలుసుకోడానికి నాకు గుడ్డిదీపం కూడా కొంత సహాకరించింది. మూడుచెక్కలతో బిగింపబడిన గది తలుపులో చెక్కకూ చెక్కకూ నడుమ సందులున్నాయి. ఆ సందుల్లోనుంచి దీపపు వెలుగు వరాండా చివరవున్న గోడపైన పడుతోంది. ఉన్నట్టుండి ఆ కాంతికిరణాలకు అవరోధం తటస్థించింది. సందేహం లేదు, అదొక మానవాకారం!

కిటికీదగ్గర నిలబడి కమ్ముల్లోనుంచి గదిలోపలికి చూస్తున్నాడు. ఎవరో? ఎందుకో? నాకవగతం కాలేదు.

“జానీ! జానీ!” పిలుపు చాలా తేలిగ్గా వినిపించింది.

ఐతే వాడెవడో జానకికి పరచితుడేనన్నమాట! ఎవడు వాడు? వాడిగొంతు నులిమేస్తే బాగుండును. ఎముకలువిరిచి వాడి శరీరాన్ని ముద్దజేసి ఫుట్‌బాల్లా ఆకాశానికి ఎగురతంతే యింకా బాగుండును.

ఇంతలో గాజులు గలగల మన్నాయి

“ఏమిటిది? ఎందుకూ?” జానకి గొంతు

“తలుపుతియ్—”

“ఎందుకో చెప్పవేం”

“తియ్, చెబుతాను”

తలుపుదగ్గరికి జరిగాను. కనుమరుగైపోయే లోపల వాడిముఖాన్నొకసారి స్పష్టంగా చూడాలని నా ఆదుర్దా. చూచి నేను చేయగలిగిందేమీ లేదు. ఐనా వాణ్ణి చూడ్డానికి ప్రయత్నించాను. గుడ్డివెలుగులో వాడి ముఖం నాకు ఒక్క క్షణంమాత్రం కనిపించింది. ఆవ్యవధిలోనే నేను వాణ్ణి పోల్చుకున్నాను.

వాడు ద్వారబంధాన్ని సమీపించాడు. తలుపు మెల్లగా తెరచుకుంది. వాడు నీడలా లోపలికి జారిపోయాడు. తలుపుకు గడియపడింది. ఎంతజాగ్రత్తగా వేసినా కీచుమనడం ఆగడియ అలవాటు.

ఆ అర్ధరాత్రివేళ నాహృదయంలో ఎలాటి తుఫాను ఘూర్ణిల్లిందో నేను చెప్పలేను. నాకళ్ళకు ప్రపంచంగిర్రున తిరుగుతున్నట్టుతోచింది. నేనింతవరకూ స్వర్గంలో వున్నట్టు భ్రమించాను. కాదు. ఇదినరకం. స్వర్గమన్న అపోహతో నేను నరకలోకంలో పరిభ్రమిస్తున్నాను. అబ్బ, ఏంబాధ యిది! సలసల కాగుతున్న తైలంలో పడదోసి నన్నెందుకు మాడ్చివేస్తున్నారు? సూదులుతాపడంచేసిన యంత్రఫలకాల మధ్య నిలబెట్టి నన్నెందుకు చిత్రహింసకు గురిచేస్తున్నారు? నే నేంతప్పుచేశానని?

తప్పుచేసింది నేనుగాదు! జానకి. ఆమె తప్పు చేస్తోందని నే నెందుకు బాధపడాలి? ఆమె ఎవతె? నే నెవణ్ణి? నేను త్రాచుపాముని పువ్వుహార మనుకున్నాను. నిజం ఈనాటికి తేలింది. పణంలా పైకి లేచిన యౌవన దురహంకారంతో కళ్ళుకానకుండా ప్రవర్తిస్తున్నావా జానకీ! ప్రవర్తించు నువ్వేమైపోయినా నాకు చింతలేదు!

దీపం పెద్దది జేశాను. కూజాను పైకెత్తి ఒక చుక్క నీళ్ళనైనా మిగల్చకుండా గుటగుట త్రాగేశాను. నిద్ర వచ్చే అవకాశం దాటిపోయింది. ఈ రాత్రికి జాగరణే! చేతికి తగిలిన పుస్తకాన్ని పైకి తీశాను.

కాని మనసు పుస్తకంలో లీనంకావడం లేదు. అది కళ్ళెంలేని గుర్రంలా ఎంత ప్రయత్నించినా పది పదిహేను రోజుల క్రితం జరిగిన సంభవంపైకే ప్రసరిస్తోంది.

ఆ రోజు ఆదివారం రాత్రి పదిగంటల వేళ. నాటకంనుంచి ఒక మిత్రుడితో బాటు యింటికొస్తున్నాను.

బజారు సట్టనడుమ ఒక పెద్దగుంపు ప్రోగైవుంది.

“ఏం జరిగింది?” మిత్రుణ్ణి ప్రశ్నించాను.

అతడు జనంలోదూరి అసలు దృశ్యాన్ని చూచివచ్చి “త్రాగుబోతు, త్రాగి మత్తులో ఒళ్ళు తెలియక క్రింద పడిపోయాడు” అన్నాడు.

“ఎవడు వాడు” ?

“చూచిరా, వాడికథ చెబుతాను”

మనుషుల్ని ఒతిగించుకుంటూ ముందుకు వెళ్లాను. నిజంగా అది చూడవలసిన దృశ్యం! క్రింద పడివున్న వాడు ముసలీ ముతకా కాదు. వాడి వయస్సు పాతికేళ్ళకు లోబడి వుంటుంది మంచి స్ఫురద్రూపి తెల్లటి

గ్లాస్గోమల్లు పంచమీద సిల్కు జుబ్బా తొడుక్కున్నాడు. దొరలు కాల్చుకునే సిగరెట్ల తాలూకు టిన్ను ఒకటి అతడి జేబులోనుంచి క్రిందపడి మూత వూడిపోగా సిగరెట్లు వీథిలో చెల్లాచెదురుగా పడివున్నాయి నలుగురైదుగురు ఆ సిగరెట్లనే ముట్టించుకుని జీవం వుందో లేదో తెలుసుకోవడానికి కాబోలు వంగి ఆ పడిపోయి వున్నవాడి ముఖంమీదికే పొగ వదులుతున్నారు!

గుండెలు బరువెక్కగా గుంపులోనుంచి బయటికి వచ్చి స్నేహితుణ్ణి కలుసుకుంటూ "వాడికథ చెబుతానన్నావే" అని జ్ఞాపకం చేశాను.

"వాడి దీవూరే. నేనూ వాడూ ఒక సంవత్సరం పాటు ఒకే డెస్కులో.కూచుని చదువుకున్నాం. ఆ తరువాత నేను పైతరగతికి వెళ్ళిపోయాను. వాడా తరగతిలోనే, ఆడెస్కులోనే వుండిపోయాడు. అంతెందుకు? వాడి చదువు ఆతరగతిలోనే పూర్తయిపోయిందని చెబితే ఒకమాటతో సరిపోతుంది."

"బాగా డబ్బున్నవాడేమిటి?"

"డబ్బూ వుంది. డబ్బుతోబాటు అబ్బిన దుర్వ్యసనాలూ వున్నాయి తండ్రి లేడు. తల్లి వుంది. ఆమెగారికి వీడంటే చెప్పరానంత ముద్దు! వీడు తాగి తందనాలాడినా, ప్రొద్దుమాటునుణ్చా ముండేసంగుల్లో శికారు తిరిగినా ఆవిడకు తప్పుగా తోచదు డబ్బుంది గనుక ఆడబ్బుతో సాధ్యమైన ఆనందాలను వీడనుభవిస్తుంటే చూడలేక లోకం కళ్ళల్లో నిప్పులు పోసుకుంటోందని ఆమె అనుకుంటుంది."

"అయ్యో గ్రహచారమా!" అంటూ విస్తుపోయాను.

"దురాచారాన్ని, వ్యభిచారాన్ని గ్రహచారమని నువ్వు సరిపెట్టుకోజూస్తే, నాకేం చింతలేదు. కానీ వీటివల్ల చిట్టచివరకు మిగిలేదిమాత్రం విచారం, లేకపోతే వినాశం" అన్నాడు మిత్రుడు ఒక సత్యాన్ని సిద్ధాంతీకరించినట్టు.

"ఇంతకూ వీడిపేరు చెప్పావుకావే" అన్నాను.

"లక్షణమైన పేరు. వాసుదేవమూర్తి. సంగ్రహంగా వాసు అని వ్యవహరింపబడుతాడు"

తలదిమ్మ తిరిగింది! వీడేనా వాసు? వీడేనా జానకి మేనత్త కొడుకు?...అప్పటికింతే అనుకున్నాను. కానీ యింతలోనే ఈ రాత్రివేళ ఒంటరిగా గదిలో కూచుని, జానకి తలుపుతీయగా యింట్లో ప్రవేశించిందికూడా వీడేనా అని వితర్కించుకుంటున్నాను. కళ్ళతో ప్రత్యక్షంగా చూచిన తర్వాత కూడా సందేహమేమిటి? వాడే వీడు!

ఎప్పుడు తలగడ పైకి వాలిపోయానో తెలియదు అది నిద్ర అని చెప్పడానికి వీల్లేదు. మనసూ, బుద్ధీ, మెదడూ అన్నీ శ్రమించి యిక శక్తిలేక శోషిలిపోయినప్పుడు కలిగే ఒక విచిత్రావస్థ. కళ్ళు తెరిచేసరికి సూర్యకిరణాలు కిటికీగుండా చాపపైన పడుతున్నాయి. దీపం పెద్దదిగా వెలుగుతూనే వుంది.

తలుపు తెరుచుకుని పెరట్లోకి వెళ్ళాను. జానకి బావిదగ్గర అంట్లు తోముకుంటోంది. ఆమె ముఖంలో చింతాకంత విచారమైనా వ్యక్తం కావడంలేదు.

"అదేమిటన్నయ్యా! రెండు నెలలు పడకబడిన వాడిలా తయారైవున్నావు" పరామర్శించింది జానకి.

"రాత్రి నాకు పిచ్చిబట్టింది" అన్నాను.

"దెయ్యం పట్టలేదుగదా!"

"ఆ పట్టే దెయ్యమేదో నిన్నే పట్టింది" అందామనుకున్నాను. అనబోయాను. కాని అనలేదు.

ఆ రోజు హోటలులో భోంచేస్తూ "నాకొక గది చూచిపెడ్తావా రంగమ్మత్తా" అని అడిగాను.

"ఏం! ఇప్పుడున్నదాని కేమొచ్చింది?" అంది రంగమ్మ.

"ఏమో, నాకు సరిపడ్డంలేదు"

"ఆ అమ్మా కూతుళ్ళు నిన్ను సొంత మనిషికి మల్లే చూచుకుంటుంటే సరిపడలేదంటావేమిటి? ఐనా ఎండాకాలం సెలవులు రానీ వుండు, ఎక్కడైనా గది ఖాళీ అయితే చెబుతాను."

పెరట్లోకి వెళ్ళి చెయి కడుక్కుంటూ వుండగా రంగమ్మత్త దగ్గరగావచ్చి "ఏం చంద్రయ్యా! ఉన్నట్టుండి గది మార్చేయాలంటున్నావు. ఏం జరిగిందేమిటి?" అని ప్రశ్నించింది.

ఆవులిస్తే పేవులు లెక్కబెట్టే వాలకం రంగమ్మది! అనుమానమంటూ ఒకటి కలగాలేగాని దాని కలరూపు తెలుసుకోడానికి ఆవిడకు వెయ్యి వుపాయాలు చేతనౌను. ఆమె నాలుగు గోడలమధ్య

వుంటూనే తీగను కదిలిస్తుంది. అంతటితో పట్టణం, పట్టణమంతా డొంకలా కదలిపోతుంది.

"అబ్బే, విశేషమేమీ లేదు. ఆగది కాలేజికి కొంచెం దూరంగా వుండంతే" అన్నాను.

వేసవి సెలవులు మార్చి మూడో వారంలో ప్రారంభమౌతాయి. ఈ ఏడెనిమిది వారాలూ వీలైనంత వరకూ గదివైపు వెళ్ళకుండా కాలహరణం చేయదలచుకున్నాను. కంబైండ్ స్టడీ అని పేరుబెట్టి మేం నాలుగైదుమంది సహపాఠకులం కాలేజీలోనే ఓ గదిలో చదువుకోసాగాము. అప్పుడప్పుడూ పుస్తకాలకనీ, బట్టలకనీ గదిదగ్గరికి వెళ్ళవలసి వచ్చేది. వెళ్ళినప్పుడల్లా ముక్తసరిగా ముసలావిడతో మూడు మాటలు మాట్లాడి బయటికి వచ్చేయాలని అనుకునేవాణ్ణి. కాని జానకి విడిచిపెట్టేది కాదు. "వేళకు స్నానం చేయడం లేదు, ఇంటికి రావడం లేదు. చదివి చదివీ కళ్ళు లోపలికి పోయాయి, ముఖం పీక్కుపోయింది. మనిషిని క్రుంగదీసే చదువు చదివేం, చదువకేం" అంటూ సాధించేది.

ఈ జానకినిగురించి నేనేమనుకోను? తను చేస్తున్నది తీవ్రమైన తప్పిదమని ఈమెకు తెలియదా? లేక తెలిసే చేస్తోందా? దీనివల్ల ఏలాటి విషమపరిణామాలు ఏర్పడ్డానికి అవకాశముందో ఈమె బుద్ధికి తట్టడం లేదా? ఏమో, జానకింతా అయోమయం! నా పాలిటి కామె ఒక చిక్కువిడని సమస్య.

వక్కపొటికేలో పుగా క్రుంకిపోమే ప్రొద్దుతోనూ, ఎంతకూ అంతంగాని రాత్రులతోనూ యిరవైఎనిమిది రోజుల ఫిబ్రవరినెల శరవేగంతో గడచిపోయింది. పరీక్షలు వ్రాసి, పెట్టేబేడా సర్దుకుని వీడ్కోలు తీసుకోడానికి యింటిలోపలికి వెళ్ళాను. మంచాన్నంటిపెట్టుకపోయిన ముసలావిడ ముఖంలో క్రమేపీ జీవకళ నీరసించిపోతోంది. జానకి ముఖంలో సైతం ఎన్నడూ లేంది ఒక విచారరేఖ నాకారోజున స్పష్టంగా పొడగట్టింది. అది నేను వెళ్ళిపోతున్నందుకు కలిగిన విచారమా? లేక స్వయంకృతాపరాధాన్ని హఠాత్తుగా గుర్తించినందువల్ల కలిగిన పశ్చాత్తాపం గుండెల్లోనుంచి పొంగి ఆమె ముఖాన్ని వివర్ణంచేసి వేస్తోందా?

"వెళ్ళొస్తాను జానకీ" అన్నాను.

వంట చేసుకుంటున్న జానకి నాకేసి తిరిగింది. ఆమె కళ్ళల్లోనుంచి కన్నీరు ధారలుగట్టి ప్రవహిస్తోంది.

"ఎందుకేడుస్తావు జానకీ?" అది వూరడింపు కాదు. ఊరికే నిర్లిప్తంగా ప్రశ్నించాను.

అమ్మస్థితి యిలా దిగజారిపోతోంది నాకు అన్నతమ్ముళ్ళు లేరు. అక్కచెల్లెళ్ళు లేరు."

"అవును నిజమే" అన్నాను.

"ఈ దిక్కులేనిదాన్ని మరచిపోతావా అన్నయ్యా!"

ఒక్కసారిగా నేను హృదయానికి బిగించుకున్న ముళ్ళన్నీ పుటుక్కున తెగిపోయాయి. కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. ముఖాన్ని మరోవైపుకు తిప్పుకుంటూ "ఎలా మరచిపోగలను జానకీ! నువ్వింతటి మంచిదానివి గాకపోతే మరచిపోయేవాడినేమో! మనుషులకింత మంచితనం పనికిరాదు. మనుష్యుల్లో పశువులున్నారు. వాళ్ళు తేనెపూసిన కత్తుల్తో తడిగొంతుకలు కోస్తారు. ఐనా నీకే భయంలేదు. భగవంతుడు నిన్ను రక్షిస్తాడు" అన్నాను.

బహుశా నామాటలు అర్థమై వుండవు. జానకి నివ్వెరపోతోంది.

"అవును జానకీ? ఇవి నేను చెప్పిన మాటలు కావు. ఎవరో నాచేత పలికించారు" అంటూ పెట్టె తీసుకుని బయటికి వచ్చాను.

జానకి గది గుమ్మంవైపు చూస్తూ "మళ్ళీ వస్తావు గదూ అన్నయ్యా! ఈసారి నువ్వు వచ్చేంతవరకూ ఈతలుపు యిలాగే వుంటుంది. నువ్వే వచ్చి తీసుకోవాలి" అంది.

"అలాగే జానకీ! జాబులు వ్రాస్తుంటావు గదూ!" అప్రయత్నంగా నే అడిగాను.

జానకి కంబానికి ఆనుకుని వ్రాస్తానన్నట్టు తలాడించింది. నేను తలవంచుకుని వీథి వెంబడి నడవసాగాను....

* * *

"ఏమండీ! ఏమండీ!" తలుపుపైన చప్పుడుతో బాటు పిలుపు వినిపించింది.

"ఎవరూ? ఏమిటి? ఎందుకూ?" అంటూ పైకి లేచాడు సూర్యం

"అయ్యోరామ! అదేం కంగారు బాబూ! అదే పనిగా టెలిఫోన్ మ్రోగుతుంటే పిలుద్దామని వొచ్చాను" అంది నీరజ.

తలుపు తెరుస్తూ సూర్యం "ఎవరో అడగలేక పోయావా" అన్నాడు.

"అడక్కేం! 'మాట్లాడుతున్నది డాక్టర్ చెట్టూర్. అవసరం. అత్యవసరం' అని గోలపెడుతున్నాడు"

సూర్యం ఒకసారికి మూడేసి నాలుగేసి మెట్లుగా క్రిందికి లంఘించి రిసీవరు చేతికి తీసుకున్నాడు.

"హలో డాక్టర్! నేను సూర్యనారాయణని ఏం జరిగింది.

"ఉదయం మీరు పంపించారే ఆ ముసలాడు..."

"ఏమయ్యాడు?"

"అతడి స్థితి చాలా అపాయకరంగా వుంది"

"ఉంటుంది. ఎందుకుండదు? వాడు సంఘానికి చీడపురుగ్గా బ్రతికాడు. మానవతుల శీలానికి ముప్పుగా బ్రతికాడు. ఈమాట నేను చెప్పడంలేదు మా నాన్నగారు చెబుతున్నారు. పాపాలు వూరికే వదుల్తాయా డాక్టర్? పాములు కప్పల్ని తరుముతాయి పాపాలు మనుషుల్ని వెంటాడుతాయ్. వెంటాడనీ. అందుకేవరేం చేయగలరు? మీరు...మీరు..."

చేతిని సూర్యం నోటికడ్డంగా చాచి "ఏమిటండీ మీగగ్గోలు" అంటూ అపవారించింది నీరజ

సూర్యం కాస్త తమాయించుకుని నీరజ చేతిని అవతలికి తోసివేస్తూ "మీ చేతనయింది మీరు చేయండి డాక్టర్? అంతకంటే నేనేం చెప్పగలను" అన్నాడు.

"ఆల్ రైట్. ప్రయత్నిస్తాను" అంది అవతలి కంఠం. సూర్యం రిశీవరును యథాస్థానంలో వుంచి మేడమెట్లకేసి తిరిగాడు.

"కాసేపుండండి కాఫీ తీసుకొద్దురు గానీ" అంటూ నీరజ వంటగదికేసి వెళ్ళింది

చేతివేళ్లను క్రాఫింగులో దూర్చి కణతల్ని గట్టిగా అదిమి పట్టుకుంటూ కళ్లు మూసుకుని సూర్యం కుర్చీలో కూచున్నాడు. నీరజ ఎప్పుడు వచ్చిందో సూర్యానికి తెలియదు. పెదవులకు వేడి కప్పు తగిలి చురుక్కుమనగా వులిక్కిపడి అతడు కళ్లు తెరిచాడు. "త్రాగండి కాఫీ" అంది నీరజ.

సూర్యం కప్పును చేతిలోకి తీసుకుని ముఖం పైకెత్తి ఓ గ్రుక్కెడు కాఫీ నోట్లో పోసుకున్నాడు.

"అదేమిటండీ కాఫీని మంచినీళ్లలా తాగేస్తున్నారు!" విస్తుపోయింది నీరజ.

కప్పును టేబిల్ పైకి జారవిడిచి సూర్యం అలాగే పైకిలేచాడు. కుడ్యానికి అలంకారప్రాయంగా అమర్చి వున్న పెద్దసైజు ఛాయా చిత్రాన్ని చూస్తూ ముందుకు నడవసాగాడు. "సౌభాగ్యవతి జానకి"

పటంక్రింద ఎవరు వ్రాసారో గానీ ఆ అక్షరాలు ముత్యాల్లా మెరిసిపోతున్నాయి.

"మీ వాలకం చూడనూ, చూడనూ నాకు మతిపోతోందండీ బాబూ! అది మీ అమ్మగారి ఫోటో. ఈరోజు కొత్తగా అందులో ఏం కనబడిం దేమిటి?" అంది విస్మయంతో నీరజ

సూర్యం దిక్కులు తోచనివాడిలా నీరజమాటలు విన్నాడు. మళ్ళీ ఛాయాచిత్రాన్ని చూచాడు. మేడమెట్ల దగ్గరికి దూకాడు. మరుక్షణాన మేడపైన గదిలో వున్నాడు.

* * * *

"పట్నాల్లోనైతే కాలం విద్యుల్లతలా పరుగులు తీస్తుంది పలెటూళ్లలో అంచనడకలు నడుస్తుంది. ఊళ్ళో మూడు నెలల వేసవి సెలవులు మూడు యుగాల్లా గోచరించాయి. పదిగంటలకల్లా స్నానం చేసి సుష్టుగా అన్నంతిని నిగనిగలాడే నీరెండలో టెంకాయతోపు దగ్గరికి నడుస్తుంటే ఎప్పుడెప్పుడు మంచం పైన వాలిపోదామా అనిపించేది. చల్లటినీడలో పడుకొని పుస్తకం తెరిస్తే మనసు ఎక్కడెక్కడికో వుమ్ములు తెంచుకుని ఎగిరిపోయేది ఎందుకో అర్థం కాని కాలేజిచదువులు, ఉన్నా వూడినా హృదయాన్ని కదిలించలేని విద్యార్థుల సాహచర్యాలు, రుచిగానే వున్నా నాలుగుపూటలు వరుసగా తినేసరికి ముఖం మొత్తే రంగమ్మభోజనం, ఈ తలపుల చిట్టచివర జానకి! వల్లమాలిన ఆత్మవిశ్వాసం, అతిక్రమించిన అమాయకత్వంలాంటి నిరుపయోగకరమైన ఆయుధ సామగ్రితో జీవిత రణరంగంలో నిస్సంశయంగా ప్రవేశిస్తున్న నిస్సహాయ జానకి! ఏమైవుంటుందో జానకి!

ఏమో! నాకు తెలియదు. మూడు నెలలుగా ప్రతిరోజూ తపాలావాడికోసం ప్రతీక్షించాను.

వచ్చాడు. వెళ్ళిపోయాడు. జానకిదగ్గరనుంచి మాత్రం వుత్తరం లేదు.

నా చదువుకోసం నాన్నగారప్పటికే ఐదారు వందలు అప్పుచేసి పెట్టారు. ఇంకా మూడేళ్లు చదువుకొంటే నా చదువుకు రాణింపులేదు. అత్తగారింటి నుంచి వచ్చే ఆడబిడ్డలకు సారెసారెకూ సారెలు పెట్టి పంపాలి. అప్పుచేయడానికిమాత్రం యింకా బోలెడన్ని అవసరాలున్నాయి. కాని ఒక్క బాంకులోనైనా పది రూపాయలు చెల్లువేయగల అవకాశం కనుచూపు మేరలో కనిపించడంలేదు. సమయానికి మా నాన్నగారికొక మార్గాంతరం స్ఫురించింది. ఆయన నన్ను పెళ్లిళ్ల మార్కెట్టులో పెట్టారు. తెలివి, చదువు, అందం మొదలైన నా యోగ్యతల్ని గురించి పరిచితులద్వారా బంధువులద్వారా ప్రచారంచేశారు. ఏతత్ఫలితంగా నాకో సంబంధంవచ్చింది. అమ్మాయి యింకా చిన్నపిల్ల. నా చదువుకిక వాళ్ళే పెట్టుబడిపెడ్తారు. పెళ్ళి ఒక సంవత్సరం తరువాతజరిగినా పరవాలేదు. ఈ షరతులతో కాబోయే నా వివాహానికి యిటు మా నాన్నగారికి అటు అమ్మాయి తండ్రికి ఒప్పందాలు కుదిరాయి.

రేపు కాలేజి తెరవబోతున్నా రనగా ఈరోజు మధ్యాహ్నం పన్నెండు గంటలకు అనంతపురంలో దిగాను. రంగమ్మ హోటలు స్టేషనుకు చేరువలోనే వుంది. రైల్లో కూచుని నరాలు పట్టుకపోయిన కాళ్ళు సీడ్చుకుంటూ రోడ్డువెంబడి నడుస్తున్నాను. జరుగుతున్నది ఎండాకాలం గాకపోయినా ఎండనిప్పులు చెరిగిపోస్తోంది. గడచిపోయిన వేసవిలో సైతం ఇలాటి మండుటెండలు లేవు. పైగా మేనెల పొడుగునా ముసురుబట్టి జడివానలు కురిశాయి. చైత్రవైశాఖాలు వసంత మనుకుంటాను. కొన్ని చెట్లు చైత్రం రాక ముందే చిగురిస్తాయి. కొన్ని చెట్లు వైశాఖం తర్వాత చిగురిస్తాయి. కాలమనేపట్టకంలో ఋతుధర్మాలే వక్రీభవనం చెందుతున్నాయి. ఇక మానవస్వభావాల మాటేమిటి!

“బాగున్నావా నాయనా!” అంది రంగమ్మత్త నేను కనపడగానే.

“ఏదో, యిలావున్నాను” అంటూ నేలపైన చతికిలపడ్డాను.

రంగమ్మ యిచ్చిన స్వాగతం నాకు రుచించింది గాదు. మరికొంత ఆప్యాయంగా ఆమె నన్ను పలకరించి వుండవలసింది. ఒకటి రెండు నెలల తర్వాత మనిషి కనబడితే రంగమ్మ వాడికి స్వాగతమిచ్చే తీరే వేరు. గబగబా వాడిదగ్గరకువచ్చి కనుగుడ్లు పెద్దవిగా నిలువునా పరిశీలిస్తూ “ఇదేమిటయ్యోవ్! బాగా చిక్కిపోయావే” అనో, “ఉర్లగడ్డలా ఊరిపోతున్నావే అల్లుడా! పెళ్ళి తలపెట్టుకోగూడదూ” అనో నవ్వుతూ పరామర్శించడం రంగమ్మ అలవాటు. నాకలాటి మర్యాద జరగలేదు. జరక్కపోయినందుకు కాదు నా చింత! రంగమ్మ కెందుకో నాపైన కినుక గలిగింది. కారణమేమిటి? అదే నా ఆలోచన.

హాల్లో భోంచేస్తున్నవాళ్లు ఒక్కొక్కరుగా లేచిపోయారు. రెండో బంతికి నేనొక్కణ్ణి మాత్రం మిగిలాను. హోటల్లోకొత్తగా చేరిన అబ్బాయి ఒకడు వడ్డిస్తున్నాడు. రాత్రి భోజనానికి వంకాయలు తరుక్కోడంకోసం కత్తిపీట పైన కూర్చుంటూ రంగమ్మ ఒకసారి నన్ను తీక్ష్ణంగా చూచి “మట్టిగుర్రాన్ని నమ్మి గోదావరిలో దిగకూడదు” అంది.

సుమారుపాటి పిడుగొకటి తలపైన పడినట్లయింది నా పని. అన్నం తింటున్న విషయం కూడా మరచిపోయి తెల్లబోతూ రంగమ్మకేసి చూడసాగాను.

“ఒక సంవత్సరంపాటు ఆ యింట్లో వున్నావు. వాళ్ళు నిన్నక్కడే తినమన్నారు కూడా! అంతగా నువువాళ్ళకి కావలిసినవాడివయ్యావు. ఈ ప్రపంచకంలో వాళ్లకు మగదిక్కంటూవుంటే నువ్వొక్కడివే! ఐతే నువు చేసిన పనేమిటి?”

“ఏం చేశాను?” నిజానికి నేనేమీ తప్పు చేయలేదు. కాని నేనెందుకో భయంతో వణకిపోతున్నాను. బహుశా ఆ క్షణాన నా ముఖం పాలిపోయి వుంటుంది.

“ఇంకేం చేయాలి? ఆ ముసలావిడ ప్రాణం గుటుక్కుమన్నప్పుడు నువు రావలిసింది! పాపం, ఆ పిల్ల ఏం చేస్తుంది? పైగా వట్టిమనిషి కూడా గాకపోయే!”

“ఏమిటీ!”

నా ఆకతాయితనాన్ని అవహేళన చేస్తున్నట్టుగా ఓసారి తేలిగ్గానవ్వి “ఏమిటో నీకే తెలియాలి బాబూ! మాకేం తెలుస్తుంది?” అంది రంగమ్మ.

“నాకేం తెలియదు” అన్నాను. అనడమేమిటి, వీధిలోకి వినిపించేటట్టు అరిచాను. అది స్వగృహం

కాదు. అయివుంటే ఆకోపంలో నేను అన్నాన్ని నలుమూలలకు వెదజల్లేవాణ్ణి. నా కంత కోపం తెప్పించినవాళ్లపైకి టంబ్లర్ గిరవాటు వేసివుండే వాణ్ణి.

"నీకేం తెలియదూ? నువ్వేపాపమూ ఎరుగవూ?" నిలదీసి ప్రశ్నిస్తోంది రంగమ్మ.

"అవును. నాకే పాపమూ తెలియదు. కావలిస్తే తినబోతున్న అన్నాన్ని చేతబట్టుకుని ప్రమాణం చేస్తాను" అన్నాను.

రంగమ్మ విచిత్రమైన మనిషి. ఒక క్షణంలో ఆవిడ కోపం నాపైన అసహ్యంగా మారిపోయింది "తప్పు చేయకపోతే నీకెందుకు కోపం వస్తుంది? దోషం నీలో లేకపోతే నానోట మాట వచ్చీ రాకముందే నువ్వెందుకు ప్రమాణాలకు దిగుతావు?"

ఇదేం కుతర్కం! రంగమ్మకు నే నేం సంజాయిషీ చెప్పుకోగలను? ఎలా చెబితే ఈమెకు నమ్మకం కలుగుతుంది? లోకులు కాకులు. ఆ కాకులకు ప్రాతినిధ్యం వహిస్తున్న మనిషి రంగమ్మ. రంగమ్మ కాఁ కాఁ అంటోంది. ఇక కాకులన్నీ అరుస్తాయి. నా చెవులు చిల్లులుపడిపోతాయి. నేను వినలేను. నేను భరించలేను. వినలేక ఆబాధను భరించలేక నే నేం చేయగలను?

విస్తరిలో అన్నాన్ని అలాగే వదిలిపెట్టి పైకి లేస్తూ "నువ్వేమో మంచిదానివనుకున్నాను. నువ్వు గొడ్రాలివి. నీకు కొడుకులుంటే వాళ్ళపైన ఎవరైనా యిలాటి నీలాపనిందలు వేసి వుంటే, అప్పుడు నాబాధ నీకర్థమై వుండేది" అంటూ తొట్లో చెయి కడుక్కున్నాను.

"ఇంతమాత్రం నాకొడుకైతేనా? ఇటూ అటూ నాలుగు లెంపకాయలు వాయించి రెండు నెలల క్రితమే ఆపిల్లను వాడికి ముడిపెట్టి వుండేదాన్ని."

వీథిమెట్లు దిగుతూ ఆమాటలు విని ఆగాను. ఇక రంగమ్మతో వాదించి లాభంలేదు. తల వంచుకుని మెల్లగా వీథిలోకి వచ్చేశాను.

నడుస్తున్నాను గానీ గమ్యస్థానమేదీ! మనసిచ్చి నా మాటల్ని అర్థం చేసుకోగలిగిన వాళ్ళెవరున్నారు. ఒక్క జానకి తప్పా! అపరాధం చేయనూ చేసి, అపదూరు నాపైన పడుతుంటే వులుక్కుండా పలక్కుండా పరిణామాలకోసం ఎదురు చూస్తున్న జానకి! ఈజానకిని ఏంచేసినా పాపంలేదు. పెళ్ళి పెటాకులూ కావలసినవాణ్ణి. నలుగురిలో తల ఎత్తుకుని తిరగవలసిన వాణ్ణి. తనని తోబుట్టుగా తప్ప మరొక దృష్టితో చూచిన పాపాన పోనివాణ్ణి. నన్నిలా నగుబాట్లపాలు చేసి నాలుగోడల మధ్య కూచుంటుందా జానకి! సత్యాన్ని వెలిబుచ్చవలసిన అవసరం కలిగినప్పుడు దాన్ని ప్రకటించకుండా మౌనంగా వుండడం కన్నా ఘోరమైన అపరాధంలేదని జానక్కి తెలియదు కాబోలు. అడుగుతాను. నిలదీసి అడుగుతాను. నేనసమర్థుణ్ని కాను. సత్యమేదో కక్కించి ఈలోకుల నోళ్లు మూయడం నాచేతనౌను.

ఈ నిర్ణయానికి వచ్చినప్పుడు పట్టణంలో ఏ భాగంలో వున్నానో నాకు తెలియదు. తరువాత అయిదు నిమిషాలకు "జానకీ, జానకీ" అని పిలుస్తూ తలుపు దబదబా బాదేస్తున్నాను.

ఇరుగుపొరుగు వాళ్లు కొందరు అప్పుడే నా రాకను పసిగట్టేశారు. నా తెంపరితనానికి విస్తుపోతూ నోళ్లు నొక్కుకుంటున్నారు. కళ్ళతోనే నన్ను గురించి మాట్లాడుకుంటున్నారు.

తలుపు మెల్లగా తెరచుకుంది. లోపల ప్రవేశించాను. కళ్లుపైకెత్తి జానకిని చూడ్డానికి మన సొప్పడం లేదు. పెడముఖంతోనే నడవలోకి వెళ్ళి మంచంపైన కూచున్నాను.

"ఊరినుంచీ ఎప్పుడొచ్చావన్నయ్యా?"

అప్రయత్నంగా తల పైకెత్తి జానకివైపు చూచాను. ముఖంలో కాంతిలేదు. విరిసీ విరియని వేయిరేకులపద్మానికి కాడదగ్గర కాటు పడింది. ఆ కాటు లోకానికి కనపడ్డంలేదు. కాని పువ్వు వాడిపోతుండడంమాత్రం లోకం రూక్షవీక్షణాలతో చూస్తోంది. కడకది వాడి వత్తై శుష్కించి నశించిపోడాన్ని కూడా లోకం నిర్లిప్తంగా చూడగలుగుతుంది.

కూలిపోయిన రాజప్రాసాదంలో ఏపుగా పెరుగుతున్న బొంతజముడుపొదలా జానకి హృదయంలో ఆవేదనలు చెలరేగుతున్నాయని ఎవరికి తెలుసు? వానలేక బీటలువారిపోయిన మాగాణి పొలంలా ఆమె మనసు వికలమైపోతోందని ఎవరికి

తెలుసు? లేకంటే ఆమె అడుసులో కాలు వేసిందని అందరూ తెలుసుకున్నారు. ఆమె పతితురాలై పోయిందని చెవులు కొరుక్కున్నారు.

"మధ్యాహ్నం బండికొచ్చాను. నేరుగా హోటలుకు వెళ్ళి భోంచేసి వస్తున్నాను."

"అన్నం తిన్నట్టు కనపడ్డం లేదే!?

"తినాలనే కూచున్నాను. కానీ తీరా మారా తినలేకపోయాను."

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? మీ అమ్మ చనిపోతే ఓ కార్డు ముక్క వ్రాయడానికైనా ఓపికలేకపోయిందా జానకీ నీకు? అవసరం లేనప్పుడు వారానికో వుత్తరం వ్రాసేదానివి. ఏమిటో మరి! ఆడవాళ్ళ మనస్తత్వ లెవరికి అర్థమౌతాయి?"

"నేను మునుపటిలా వున్నానా అన్నయ్యా? లేదు. చెడిపోయాను. ఇప్పుడు నేనేం చేసినా లోకానికి తప్పుగానే కనిపిస్తుంది. అందుకనే జాబు వ్రాయలేదు."

జానకి యింత స్పష్టంగా తప్పొప్పులు తేల్చి మాట్లాడివేస్తుందని నేననుకోలేదు! ఆమె అపరాధం చేయడంలో ఎంత ధైర్యం ప్రదర్శించిందో దాన్ని ప్రకటించడంలోనూ అంతే ధైర్యం ప్రదర్శిస్తోంది.

బయట వడగాడ్పు యింకా తగ్గలేదు ఐనా యింట్లో చల్లగావుంది. ఎండలో కాగికాగి బరువెక్కిన తల నాకు తెలియకుండా నే మంచంకోడు పైకి ఒరిగిపోయింది. కళ్ళుమూసుకుని ఆలోచనలో పడ్డాను. నేను జానకిని తీవ్రంగా మందలించాలనుకున్నాను. ఏదీ! ఎప్పుడు మందలించాను? లేకంటే ఆమె జాబు వ్రాయకపోవడం ఒక నేరంగా ఎత్తి చూపించగలిగాను. ఆమె జాబు వ్రాసివుండి సెలవుల్లో నేనొకసారి యిక్కడికి వచ్చివుంటే ఆ సంఘటనవల్ల లోకుల అనుమానం మరింత బలపడివుండేది. ఇక జానకితో నాకు అవినీతికరమైన సంబంధముందని లోకులనుకుంటున్నారంటే అందుకు బాధ్యత జానకిదిమాత్రమే కాదు నేనీ యింట్లో ఏడెనిమిది నెలలు అద్దెకున్నాను. కానీ నేనద్దెకున్నానని ఎవరనుకున్నారు? నా ప్రవర్తన హద్దులుమీరింది. అప్పట్లో జానకినీ, నన్ను చూచిన వాళ్ళు ఎంతవరకైనా వూహించుకోడానికి అవకాశముంది. వాళ్ళ కలాటి అవకాశం యివ్వడంలో జానకి దెంతతప్పో. నాదీ అంతతప్పే! నిజం యిలావుండగా జానకిని నేనేమని మందలిస్తాను?

జానకి యిప్పుడు వట్టిమనిషి కాదు. రంగమ్మ చెప్పివుండకపోయినా ఈ విషయం నాకీపాటికి తెలిసివుండేది. ఇప్పుడు జానకి లజ్జాభిమానాలు వదిలీ తననీ స్థితికి తెచ్చినవాడెవడో లోకానికి ప్రకటిస్తే నేనీ పద్మవ్యూహంనుంచి బయటపడగలను. కాని తను అనుమానాలు, ఆధారాలు మరొకవిధంగా వుండగా ఆ సత్యాన్ని లోకం తర్కవితర్కాలు లేకుండా నమ్మేస్తుందని నమ్మకమేమిటి? నేనూ జానకీ కూడబలుక్కుని ఈ అపనిందను మరొకడితలపైన రుద్దుతున్నామని వాళ్ళనుకుంటే?

"లేచి ముఖం కడుక్కో అన్నయ్యా! నాలుగు మెతుకులు ఎంగిలిపేద్దువుగానీ" అంది జానకి దగ్గరగా వస్తూ.

"నీకు జ్ఞాపకముందా జానకీ! ఆనాడు నేను బల్ల గుద్దినట్టు చెప్పాను" అంటూ లేచి కూచున్నాను. "మానవుల కింత మంచితనం పనికిరాదు మనుష్యుల్లో పశువులుంటారు. వాళ్లు తేనెపూసిన కత్తుల్తో తడి గొంతుకలు కోస్తారు."

"నిజమే అన్నయ్యా" అంది జానకి. ఆమె కంఠం గద్గదికమైపోయింది. "మోసపోయాను తప్పకుండా పెళ్లిచేసుకుంటానన్నాడు. నేను గనుక ఒప్పుకుంటే దుర్వ్యసనాలన్నీ వదులుకుంటానన్నాడు. ఇలా మోసం చేస్తాడని నాకు తెలియదు."

నేనాక్షణాన వూరుకోవలసింది. ఒకప్పుడు ఉచితానుచితాలు ఎరగకుండా నోరు జారవిడవడం నాకేకాదు, మానవుల కందరికీ పరిపాటి. అసలే అగ్ని జ్వాల అందులో నేనాజ్యం పోశాను.

"ఇలా మోసం జరుగుతుందని నాకాదినుంచీ తెలుసు జానకీ! ఆరోజు ఉదయం నేను లేచి పెరట్లోకి వచ్చాను. అదోలావున్నావేమని నువ్వు పలకరించావు. రాత్రి నాకు పిచ్చిపట్టిందన్నాను. నువ్వు దెయ్యంపట్టలేదుగదా అన్నావు. అప్పుడే అందామనుకున్నాను. ఆపట్టేదయ్యమేదో నిన్నే పట్టిందని. కానీ అనలేదు."

"మన కొండుకని పూరుకున్నావు గదూ?" సూటిగా ప్రశ్నించింది జానకి.

"అవును" అన్నాను.

"నిజమే. నీ చెల్లెలై వుంటే నువ్వా క్షణంలో నే సరిదిద్దుకునేవాడివి మక్కెలు విరగవన్ని గదిలో వేసి తాళం వేసేవాడివి. నే నెవరెతెని? నే నేమై పోయినా నీకేం చింత? ఈలోకంలో న్యాయమింతే అన్నయ్యా! అదీ యిప్పుడే తెలిసింది".

నాకు నిజంగానే పిచ్చి పట్టుందేమో ననిపించింది! ఒక గంటక్రితం నా దృష్టిలో జానకి దోషి. కాని యింతలో నే వ్యవహారం తలక్రిందులైంది నేను ముద్దాయినైపోయాను. జానకి నా మీద నేరం ఆరోపిస్తున్నది.

"అదంతా యిప్పు డెందుకన్నయ్యా! నువు భోంచేద్దువులే" అంది జానకి.

లేచి ముఖం కడుక్కొని గదిలోనికెళ్ళి పీటపైన కూచున్నాను. అన్నం వడ్డిస్తూ అంది జానకి. "అమ్మకు పదిరోజులు జ్వరం కాసింది. నాలుగురోజులు ఒంటి మీద స్మారకం లేదు"

"మందిప్పించలేమూ?" అన్నాను.

"డాక్టరొచ్చాడు. రెండు సూదులు వేశాడు. గుణం కనిపించలేదు. పెదవివిరిచి వెళ్ళిపోయాడు. జ్వరం వచ్చినకొత్తలో అమ్మ చంద్రానికైనా జాబు వ్రాయకూడదా జానకీ అంది."

"ఏమన్నావు?"

"ఎవరొచ్చిమాత్రం చేసే దేముందని వూరుకున్నాను. ఇక రెండురోజుల్లో స్మారకం తప్పిపోతుం దనగా అమ్మ నన్ను దగ్గరకు రమ్మంది. మంచంపైన కూచోమంది. నా తలను రొమ్ము కానించుకుని 'ఈ లోకంలో ఎలా బ్రతగ్గలవు జానకీ' అని అడిగింది. దేవుడున్నాడులే అమ్మా అన్నాను. రాత్రులు బొత్తిగా నిద్రపట్టేది కాదు. ఏ వేళకంటే ఆ వేళకు లేచి పాలు త్రాగించేదాన్ని. ఓపరికం వున్నంత వరకూ గుక్కెడు గుక్కెడుగా పాలు మింగింది. ఆతర్వాత పోసినపాలు యిట్టే వచ్చేసేవి. ఓ రోజు రాత్రి తెల్లవారుఝామున లేచి కుంపట్లో పాలు కాచి మంచం దగ్గరకు తీసుకెళ్లాను. అమ్మ వులక లేదు. పలక లేదు. చనిపోయింది."

జానకి వెక్కి వెక్కి ఏడుస్తోంది. "అమ్మేకాదు జానకీ! మన మందరమూ చనిపోవలసిన వాళ్ళమే" అంటూ లేచి చెయికడుక్కున్నాను. జానకి విస్తరి తీసుకెళ్ళి పెరట్లో పారవేసి లోపలికి వస్తోంది.

"ఒకసారి నేను వాసుతో మాట్లాడి చూస్తాను జానకీ" అన్నాను నడవలోనుంచి ఆకాశంవైపు చూస్తూ.

జానకి రెండు క్షణాలు ద్వారంవగ్గర ఆగింది. తర్వాత మౌనంగా వంటగదిలోకి వెళ్ళిపోయింది. ఆ పరిస్థితిలో మౌనంగా గాక మరొకవిధంగా జానకి ఎలా అంగీకారాన్ని వెలిబుచ్చగలుగుతుంది?

తలుపుతీసుకుని చరచరా వీధిలోకి వచ్చేశాను. వాసుదేవమూర్తి ప్రత్యేక నివాసగృహాన్ని నేనొకటి రెండుసార్లు చూచాను. కానీ అతడు యింటిపట్టున పడివుండే మనిషి కాదు. అదృష్టవశాత్తు ఆరోజు సాయంత్రం యింటి దగ్గరే కనిపించాడు. చూచిచూచి దాన్ని యిల్లని పేర్కొనడం బాగుండదు. అది పాశ్చాత్యుల అర్ధరాత్రి క్లబ్బులాటిది. హాలునిండా గ్రీకు దేవతల నగ్నశిల్పాలు, గోడలకు లోక్లాసు మంగలి షాపుల్లో వుండదగిన బూతు చిత్రాలూ వున్నాయి. వాసును ఒంటరిగా కలుసుకోవాలనుకున్నాను. ఆ అవకాశం మాత్రం లభించింది కాదు. మిత్రులతో కలిసి అతడు 'మీనాఫ్' ఆడుతున్నాడు. నన్ను చూడగానే జూదగాళ్లలో ఒకడు "ఆడ్డానికి వచ్చావా" అని అడిగాడు. "కాదు, ఆయనతో మాట్లాడ్డానికి వచ్చాను" అంటూ వాసును చూపించాను. నాకేసి విచిత్రంగా చూచి "నాతో మాట్లాడాలా?" అన్నాడు వాసు. అవునన్నాను. "ఇక్కడే మాట్లాడవచ్చు" అన్నాడు. "ఎంతోసేపు పట్టదు. అయిదునిమిషాలు. ఆ గదిలోకి వెళ్దాం" అన్నాను. వాసు నాలుగాటలు ఆడి, మళ్ళీ పైకి లేచాడు. గదిలో కూచుని చెప్పవలసిన విషయం సంగ్రహంగా చెప్పేశాను. కావ్యానంతరం ఫలశ్రుతిలా ఆడవాళ్లని నమ్మించి మోసగించడం చాలా సులభమనీ, కాసుకు కొఱగానివాడుకూడా అలాటి పనిని నిర్విఘ్నంగా నెరవేర్చగలడనీ, చేసిన తప్పును సరిదిద్దుకోడం యిహపరాలకు రెంటికీ మంచిదనీ నచ్చజెప్పబోయాను. "ఆ అమ్మాయి తరఫున వకాల్తా పుచ్చుకోడానికి నీకూ, ఆవిడకూ వున్న సంబంధమే

మిటో తెలుసుకోవచ్చా?" అన్నాడు వాసు. ఐదు నిమిషాలసేపు ధారాపాతంగా అతడు మాట్లాడిన మాటల్లో సభ్యప్రపంచం. వినదగినమాటేదైనావుంటే యిదొక్కటే! మనిషికి సౌశీల్యం అవసరమన్న మూల సిద్ధాంతంలో నే నమ్మకంలేనివాడు అంతకన్నా మెరుగ్గా మాట్లాడ్డం సాధ్యంకాదేమో!

తిరిగి వస్తున్న నాకు గదిలోనుంచి పకపకలు, వికవికలు వీడ్కోలిచ్చాయి. బరువుగా అడుగులు వేసుకుంటూ చీకటి గుయ్యారాల్లా వున్న వీథుల్లో నడుస్తున్నాను. ఇంటికి వెళ్లి నేను జానకితో ఏం చెప్పాలి? ఆశ చాలా మొండిది. ఎలాటి విషమ పరిస్థితుల్లోనైనా అది నేనున్నానని పైకి పొడసూపుతుంది. నా వేడికోలును అతడు మన్నిస్తాడనీ, తన బ్రతుకు తోటలో వసంతాలు వెలివిరిసే అవకాశం లేకపోలేదని ఆశిస్తుంటుంది జానకి! ఈ ఆశాజ్యోతికూడా ఆరిపోతే ఆమె బ్రతుకేంగావాలి?

ఇల్లు చేరుకునేసరికి గంట ఎనిమిదిన్నరయింది. ఆ పాటికిజానకి మూల ముసుగు పెట్టుకునికంటికి కడివెడుగా ఏడుస్తుంటుందని నే ననుకున్నాను. కానీ నా అంచనా తారుమారయింది. గదులన్నిటిలోనూ దీపాలు వెలుగుతున్నాయి నడవలో చాప వేసుకుని జానకి అద్దం ముందు ముస్తాబు చేసుకుంటోంది. కురులు నున్నగా దువ్వి సొంపుగా జడ అల్లుకుని సింగారించుకుని ఆమె మల్లెపువ్వులు పెట్టుకుంది. కళ్ళకు కాటుకద్దుకుంది. ఈమె నేను రెండుగంటల క్రితం చూచిన జానకి కాదు! ఇప్పుడామె ముఖం విచారమేఘాచ్ఛన్నం కాదు. అలాగని ఆ ముఖంలో నాకు మరేభావమూ ద్యోతకం కాలేదు. అది చిత్రాతిలా నిర్వికారంగా వుంది.

"ఏమైందన్నయ్యా నువ్వు వెళ్లినపని?" తనకు తానుగా జానకే ప్రశ్నించింది.

"పండుకాదు జానకీ! కాయే" అని నిట్టూర్చాను.

"ఇలా అవుతుందని నాకు తెలుసు" అంది జానకి.

కొండలు పిండిజేసి అలసిపోయిన వాడికిలా నా కా రాత్రి ఎక్కడలేని నిద్ర వచ్చింది. ఎప్పుడు మంచం పైన మేను వాల్చానో, ఎప్పుడు నిద్రపట్టిందో నాకు తెలియదు. ఉన్నట్టుండి ఎవరో తట్టిలేపినట్లు మేల్కొన్నాను. వెన్నెల పాలార కాస్తోంది. ఇంట్లో చీమ చిటుక్కుమనడం లేదు. దాహంతో నాలుక పిడచగట్టుకపోతోంది. "జానకీ, జానకీ" అని పిలిచాను. బదులు లేదు. జానకి ఎక్కడ పడుకున్నట్టు? గది తలుపు తెరచి చూచాను. చాప ఖాళీగావుంది. నా గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. చేజేతులా జానకిని మృత్యుదేవతకి అప్పగించిన పాపంనుంచి నేనెలా తప్పించుకోగలను? ఇటూ, అటూ చూచాను. వీథిలోకి పోదామనుకున్నాను. వీథి తలుపుకు వేసిన గడియ వేసినట్టేవుంది. ఐతే జానకి పెరట్లోకి వెళ్ళిందన్నమాట! నాలుగంగల్లో పెరట్లో పడ్డాను. బావికి పది బారల్లో ఓ గంగరావిచెట్టు వుంది. జానకి చెట్టుక్రింద నిలబడి శూన్యంగా కొమ్మల కేసి చూస్తోంది.

"ఇంత రాత్రివేళ యిక్కడేం చేస్తున్నావ్ జానకీ?" అన్నాను. కొంచెం ఆక్రోశించాను.

"అది కాదన్నయ్యా! నే నొకమాట అడుగుతాను. నేను బ్రతికి మాత్రం లాభమేముంది చెప్పు" అంది జానకి.

"లాభ నష్టాల బేరీజులు నాకు తెలియవు జానకీ! ఈ ప్రాణాలు మనం సంపాదించుకున్నవి గావు. ప్రాణాల్ని ధారపోయడానికి మనకు హక్కు లేదు"

"బ్రతికితే లోకం నవ్వుతుంది"

"కానీ చస్తే లోకం ఏడవదు. బాగుపడితే కళ్లు జూడని, చెడిపోతే చేరదీయని గుడ్డిలోకంతో మనకు ప్రసక్తిలేదు."

"నువ్వు పిచ్చివాడివి అన్నయ్యా!" అంది జానకి.

"నాకు కాదు జానకీ! ప్రపంచానికి పిచ్చి మనం అన్నా చెల్లెళ్లలా ప్రవర్తిస్తే ప్రపంచం ఏమనుకుంది? ఏమైనా సరే జానకి, నేను లోకుల్ని లక్ష్యపెట్టను. ఈ క్షణంనుంచీ నువ్వు నాచెల్లెలివి ఎన్ని కష్టనష్టాలెదురయినా నీకు నేను బాసటగా నిలుస్తాను. ఐతే నువ్వొకమాట యివ్వాలి"

"మాటా అన్నయ్యా?"

"అవును. ఏ పరిస్థితుల్లోగానీ నువ్వు ఆత్మహత్యకు తలపెట్టగూడదు."

జానకి పెదవులపైన హాసరేఖ ఒకటి స్పష్టాస్పష్టంగా భాసించింది. ఆకసంలో చందమామ కద్దు వస్తున్న దూదిపింజల్లాటి మబ్బులు అప్పటికప్పుడే

తేలిపోతున్నాయి. పూచిన సంపంగితో పెరడంతా గుబాళిస్తోంది. ఇద్దరమూ ఇంటి లోపలికి వెళ్లాము. జానకి గదిలో పడుకుంది. శృంఖలాలు తెగిపోయి బంధ విముక్తి పొందిన ఖైదీకిలా నాకు నిశ్చింతగా నిద్రపట్టింది. నిద్రపోతుండగానే తెల్లవారి ప్రొద్దు ఏడెనిమిదిబారలెక్కింది. నేనే ఆలస్యంగా నిద్ర లేచాననుకుంటే జానకి యింకా నిద్ర పోతోంది. లేపి "నిన్న సాయంత్ర మెప్పుడో తిన్న తిండి జానకీ! కడుపులో కొక్కులు తిప్పుతున్నాయి" అన్నాను. జానకి ఆదరాబాదరా గిన్నెలూ చెంబులు కడుక్కురావడానికి పెరట్లోకి వెళ్ళింది......

* * *

"బాబుగారూ, బాబుగారూ!"

"ఏం, ఏమొచ్చింది?" అన్నాడు సూర్యం.

"ఆ ముసలాడు మిమ్మల్నొకసారి చూడాలంటున్నాడు" అన్నాడు రాముడు.

"ఎందుకూ?" అంటూ సూర్యం గది తలుపు తెరిచాడు.

"ఆమాట చెప్పడం లేదు. అసలు మన యింటికి వచ్చినప్పటినుంచి వాడికి ఒంట్లో బాగులేనట్టుందండీ! మందూ, మాకూ లేదేమో ఈనాటికి రోగం ముంచుకొచ్చేసింది"

"ఇప్పుడు నాకు తీరిక లేదు. వీలైతే రేపుదయం వచ్చి చూస్తానని చెప్పు" అని సూర్యం తలుపు వేసేయబోయాడు.

"నాన్నా, నేనొస్తున్నాను" అంది మేడమెట్ల పైనుంచి పాప.

"వద్దు. క్రిందికి వెళ్ళిపో. రాముడూ! పాపను తీసికెళ్లు" అన్నాడు సూర్యం.

"ఉఁహు. నేను క్రిందికెళ్ళను. అమ్మ నీదగ్గరికెళ్లమంది" అంటూ పాప పైకొచ్చేసింది.

"అమ్మాయి గడ్డంతాత ఏమయ్యాడని అమ్మగార్ని వేధిస్తోంది బాబూ! అందుకామె మిమ్మల్ని అడగమన్నట్టుంది" అన్నాడు రాముడు.

"సరేసరి! అందరికీ ఆముసలాడి గొడవే కావలిసి వస్తోందిగాని నువు పాపని తీసుకెళ్ళు. నాకు పనుంది" అన్నాడు సూర్యం.

రాముడు పాపనెత్తుకుని క్రిందికి వెళ్ళిపోయాడు.

* * *

"జానకికి నవమాసాలు నిండాయి. హాస్పిటల్లో చేర్చాను. సుఖప్రసవం జరిగింది. మగబిడ్డ. తల్లినీ, బిడ్డనూ చూడ్డానికి చాలా కొద్దిమంది వచ్చారు. వాళ్లల్లో రంగమ్మ ఒకతె "నీ కాపురాన్ని నిలబెట్టింది నేను" అని రంగమ్మ జానకితో సగర్వంగా చెప్పుకుంది. బిడ్డను చేతుల్లోకి తీసుకుని ముక్కూ, మొగమూ పరీక్షగా చూచి "బిడ్డ అంతా చంద్రం పోలికే" అంది. నేను నవ్వాను. జానకి నవ్వలేదు. ముఖాన్ని పమిట చెరగులో కప్పుకుని దుఃఖోద్వేగాన్ని దాచుకోడానికి ప్రయత్నించింది.

ఊళ్ళో వున్న నాన్నగారికి కబురెలా అందిందో గానీ ఆయన రామబాణంలాంటి వుత్తరం వ్రాశారు. "నువ్వు చేసిన ఘనకార్యాన్ని గురించి ఎంతో సంతోషించాను. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని నువ్వీ జాబు చేరిన తక్షణం వచ్చి యిల్లు చేరుకుంటే మంచిది, లేకుంటే నేను తండ్రినీ గాను, నువ్వు కొడుకువీ కావు"

కాలేజిలో సెకండ్ టెర్మ్ జీతం కట్టవలసిన వ్యవధి దాటిపోవస్తోంది. చేతిలో పైసాలేదు ఫీజు చెల్లించకపోతే పేరు తీసేస్తారు. కాలుగాలిన పిల్లిలా యిల్లు, కాలేజి, హాస్పిటళ్ళున్య తిరుగుతున్నాను. జానకి నావాలకాన్ని పసిగట్టి "ఏమిటన్నయ్యా! హోటల్లో భోజనం సరిపడ్డంలేదా?" అంది.

"భోజనం సంగతి కాదు జానకీ! చదువు మానేసి ఏదైనా వుద్యోగంలో చేరదామనుకుంటున్నాను," అన్నాను.

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? డబ్బు అవసరంగదా!"

"చదువు మానేస్తే నామీద ఒట్టే అన్నయ్యా! ఆరు నూరుగానీ, నూరు ఆరుగానీ నువు చదువు మానుకోగూడదు అమ్మ నాకీ చైను మిగిల్చిపోయింది. దీన్ని తీసుకెళ్ళి అమ్మేయి. మూడొందల రూపాయలు చేతికొస్తాయి. ఈ సంవత్సరం గడిచిపోతుంది. ఆ తరువాత దేవుడున్నాడు. అంతగా అవసరమైతే ఉన్న పొలంలో కొంతకుకొంత అమ్మేస్తే సరిపోతుంది" అంది జానకి.

"నీనగల్ని, నీపొలాన్ని అమ్మి చదువుకోమంటావా జానకీ! అదికూడా లేకపోతే నీగతీ- నీబిడ్డ గతీ ఏంకావాలి?" అన్నాను.

"వీడు నాబిడ్డని నేననుకోడం లేదన్నయ్యా! వీడికి నువ్వున్నావు. నేను లేను. లేదు లేనంటే వీడు పాలు మరచిపోయేంతవరకైనా నేను బ్రతుకుతానో, బ్రతకనో."

"అలా అనకు జానకి! నేను వినలేను" అంటూ ముఖం మరోవైపుకు త్రిప్పుకున్నాను. కానీ ఏసంఘటనకు సంబంధించిన మాటనయితే నేను వినలేకపోయానో, అదే సంఘటనని రెండేళ్లు తిరక్కముందే కళ్లారా చూడ్డం తటస్థించింది. ఆ రెండేళ్ల యిహ జీవనంలో నేను జానకిలో జానకిని చూడలేదు! మూర్తీభవించిన వైరాగ్యాన్ని చూచాను.

ఆరోజు పూర్ణిమ. ఐనా నాకు అమావాస్య. ఉదయగిరిపైన అరుణరాగం అలముకుంటోంది. జానకి అస్థిపంజరంలా మంచాన్ని అంటిపెట్టుకుపోయివుంది. నేను బాబునెత్తుకుని మంచం ప్రక్కన నిలబడ్డాను. జానకి నన్ను తలగడదగ్గర కూర్చోమంది కూచున్నాను. తన తలను పైకెత్తి నాఒడిలో పెట్టుకోమంది. "అన్నయ్యా! మనం బాబుకింకా పేరుపెట్టలేదు. ఏమని పిలుస్తావు?" అంది.

"ఏమని పిలవమంటావు జానకీ" అన్నాను

"మానాన్నగారిపేరు సూరయ్య. బాబుని సూర్యనారాయణ అని పిలుస్తావా అన్నయ్యా?"

"పిలుస్తాను జానకీ! తప్పకుండా పిలుస్తాను."

కొంతసేపు మౌనం. మళ్ళీ జానకి నోరు తెరిచింది.

"అన్నయ్యా! నువు తప్పక పెళ్లి చేసుకుంటావు గదూ."

ఏం చెబుతాను నేను! మునిపళ్లతో పెదవి గట్టిగా కొరుక్కుంటూ సజలనయనాలతో జానకిని చూస్తున్నాను.

"ఇంకొక్క మాట మాత్రమే అన్నయ్యా!..."

"చెప్పు జానకీ" అన్నాను.

"నాకు తెలుసు వాసుకెప్పటికైనా బుద్ధొస్తుంది. అతగాడు ఆస్థిని గుల్లచేసేస్తాడు. చిప్ప చేతికొస్తుంది. అప్పుడు మనిషిగా మారుతాడు. అందాకా నువ్వతణ్ణి క్షమించొద్దులే అన్నయ్యా! అప్పుడైనా అతణ్ణి క్షమించవూ?"

"ఇదేం విచిత్రమైన కోరిక జానకీ! ఈ ప్రపంచంలో అతణ్ణి నీకంటె ద్వేషించవలసిన వాళ్లెవరూ లేరు. నువ్వే అతణ్ణి క్షమిస్తున్నావు. ఇక నాదేముంది?

బాబును తనదగర పడుకోబెట్టమంది జానకి. శక్తి వున్నంతవరకూ శుష్కహస్తాలతో వాడి ఒళ్లంతా నిమిరింది. క్రమక్రమంగా ఆమె కళ్లు మూసుకపోయాయి. నేను గదిలోకి వెళ్లి పళ్లరసం తెచ్చాను. బలవంతాన నోరుతెరచి రెండు చుక్కలు త్రాగించాను. మూడో చుక్కకు జానకి తేలకళ్ళు వేసింది. నోరు బిగుసుకపోయింది. నాచేతిలోనుంచి గ్లాసు టంబ్లరు క్రింద పడి ముక్కలయింది.

జానకి చనిపోయింది!

జానకి జీవితం ఒక విషాదగీతం! కాని అది అపాతమధురమైన విషాదగీతం. వింటుంటే ఏదో అనిర్వచనీయమైన విషాదానుభూతి కలుగుతుంది. కానీ ఎంతసేపు విన్నా యింకా వినాలనే వుంటుంది.

కథ అయిపోయింది సూర్యం! జానకి చనిపోయి యిరవైయెనిమిదేళ్లు కావస్తున్నాయి నీకిప్పుడుయిప్పై యేళ్లు.

బి. యల్. చదువు పూర్తిచేసి పెళ్ళిచేసుకున్న కొత్తలో ఓసారి నేను అనంతపురం వెళ్లాను. ఒకానొక మారుమూల హోటల్లోనుంచి బయటికొస్తూ వాసు కనిపించాడు. మనిషి చిక్కిపోయాడు. కళ్ళు లోతుకుపోయాయి. పాదాలదగ్గర చిరుగులు పడ్డ పైజమాపైన మాసిన పొట్టిచేతుల చొక్కా వేసుకున్నాడు. పెదవులమధ్య బీడీ కాలిపోతోంది.

ఒక స్నేహితుడుద్వారా తెలిసింది, వాసు ఆస్తిపాస్తులన్నీ పేకాటలలో, త్రాగుడులో, మిగిలిన దుర్వ్యసనాల్లో కర్పూరంలా హరించుకపోయాయని!

ఓసారి తిరుపతినుంచి ధర్మవరానికి ప్రయాణం చేస్తున్నాను కదిరిస్టేషనులో రైలు యింజనుకు నీళ్ళు పోసుకోడానికి పదిహేను నిమిషాలపాటు ఆగింది. మసకమసకగా సంజచీకట్లు క్రమ్ముకుంటున్నాయి. ప్లాటుఫారంపైన బీడీలు, సిగరెట్లు, ఆకులూ వక్కలూ

అమ్మకుంటూ ఒకడు నడుస్తున్నాడు. బాగా పరకాయించి చూచిగాని గుర్తుపట్టలేకపోయాను గడ్డం పెరిగి వుంది. గుండీల్లేని చొక్కాలోనుంచి బొక్కి రొమ్ము కనబడుతోంది. వెంట్రుకలప్పుడే నెరసిపోతున్నాయి.

నాలుగేళ్ళ క్రితం అనుకుంటాను మండు వేసంగిలో ఒక మధ్యాహ్నం హిందూపురం బస్ స్టాండులో చింతచెట్టు క్రింద నిలబడి బస్సుకోసం నిరీక్షిస్తున్నాను. ఒక వృద్ధుడు దగ్గరికి వచ్చి చేయి చాచాడు. "బాబూ! మొండివాణ్ణి" అన్నాడు. నిజమే. ఎడమ చేయి మోచేతివరకూ లేదు కానీకోసం జేబులో చేయివేస్తూ బిచ్చగాడి ముఖంలోకి చూచాను. జీబురు గడ్డంతో, చింకి పేలికల ఆచ్ఛాదనతో, క్రుంగి కృశించిపోయిన ఆ ఆకారంలో కలలో కనిపించినట్టు నాకు లీలామాత్రంగా ముప్పై యేళ్ళనాటి వాసు కనిపించాడు.

"ఇదిగో- నీ పేరేమిటి ?" అని అడిగాను.

వాసు నన్ను పోల్చుకున్నాడు. చాచిన చేతిని వెనక్కి తీసుకుని వెనుదిరిగి చూడకుండా బూడిదుమ్ములో నడుస్తూ దూరంగా వెళ్ళిపోయాడు.

చివరిసారి. ఎనిమిది గంటలకు కదలబోతున్న యాత్రాస్పెషలుకు రాహుకాలం వస్తుందని మనం యింటిదగ్గర అయిదున్నరకే బయలుదేరాము. నేనూ, మీపిన్నీ కారులో వెనుక సీటులో కూచున్నాము. నువ్వు కారు డ్రయివు చేస్తున్నావు నువ్వు చూచావో లేదో నాకు తెలియదు. కారు గేటుదాటుకుని రోడ్డులోకి రాబోతోంది. దారిప్రక్కన వాసు కాలపురుషుని కుంచెలో అనేక మార్పులకులోనైన వికృతిస్వరూపంతో మళ్లీ నాకు కనిపించాడు......

* * *

కాగితాల్ని అలమారాలోకి విసిరి సూర్యం తటాలున పైకి లేచాడు. తలుపు తెరుచుకుని క్రిందికి పరుగెత్తాడు. మేడమెట్లదగ్గర నీరజ ఎదురై "మీకోసం పైకొస్తున్నాను. మనం అనుకున్నంతా అయింది. హాస్పిటల్లోనుంచి యిప్పుడే ఫోను చేశారు" అంది.

"అదీ అయిపోయిందీ!" అంటూ సూర్యం కుప్పకూలలా వాలుకుర్చీలో కూలిపోయాడు.